

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త

## కండలేరులో 35.723 టీయంసీల నీటిమట్టం



**రాపూరు, జూన్ 20 ప్రభాతవార్త** మండలంలోని కండలేరు జలాశయంలో శుక్రవారం ఉదయం నాటికి జలాశయంలో 35.723 టీయంసీల నిటిమట్టం నమెదు అయినట్లు కండలేరు ఎఇ తిరుమలయ్య తెలిపారు. జలాశయం నుండి హెడ్ రెగ్యులేటర్ ద్వారా 2480 క్యూసెక్కులు, లో లేవల్ స్యూయిస్ ద్వారా 70 క్యూసెక్కులు, హైలెవల్ కెనాల్ ద్వారా 50 క్యూసెక్కుల చోప్పున మొత్తం 2600 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా వెలుతున్నట్లు ఆయన తెలిపారు.

## ప్రతిష్టాత్మకంగా యోగఆంధ్ర కార్యక్రమం

**- 10 లక్షల మందితో యోగ కార్యక్రమాలు**

**- 7000 ప్రదేశాలలో యోగ కార్యక్రమలు : జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్**




**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 20, ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 21వ తేదిన 11వ జాతీయ యోగ దినోత్సవ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 10 లక్షల మందితో యోగ కార్యక్రమాలు నిర్వహించనున్న నేపథ్యంలో మండల అధికారులతో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 7000 ప్రదేశాలలో యోగ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ప్రతి ప్రదేశంలో ఒక ప్రత్యేక అధికారి మరియు యోగ ట్రైనర్ ఉండేలా చూడాలన్నారు. మండల స్థాయిలో ఎప్పటికప్పుడు యోగా కార్యక్రమాలపై ఫోటోలను ఆన్లైన్లో అప్లోడ్ చేసే విధంగా మండల స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూములు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. 500కు మించి యోగాలో పాల్గొన్న ప్రదేశాలను ప్రత్యేకంగా యోగా చేసే వారి ఫోటోలను ప్రతిబింబించాలా చిత్రాలను తీసి ఆన్లైన్లో అప్లోడ్ చేయాలి అన్నారు. అవసరమైన చోట ఏఎన్ఎంలను ఉంచేలా సంబంధిత వైద్య ఆరోగ్యశాఖ అధికారి చర్యలు తీసుకోవాలన్నారు. విశాఖపట్నంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాల్గొన్న కార్యక్రమాలతో సమాంతరంగా కార్యక్రమం నిర్వహించాలన్నారు. గ్రామస్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా పీఏ సిస్టంలను, టామ్ టామ్ ద్వారా ప్రజలను చైతన్య పరచాలన్నారు. టీవీలు అందుబాటులో ఉన్నచోట భారత ప్రధాని ప్రోగ్రాంలను ప్రత్యక్ష ప్రసారాలు చేసే విధంగా చూడాలన్నారు. ప్రతి మూడో శనివారం చేపడుతున్న స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగా కార్యక్రమాలైన చోట సంబంధిత ప్రదేశాలలో లేదా చుట్టుపక్కన స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టాలని ప్రతి ఒక్కరి చేత మొక్కలని నటించాలని ఆయన సూచించారు. అవసరమైన చోట ఎన్. సి.సి, ఎన్.ఎస్.ఎస్ క్యాడెట్లను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి మోహన్రావు, జిల్లా విద్యాశాఖ అధికారి బాలాజీ, జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ అధికారి యతిరాజ్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతుల ప్రకారమే భవన నిర్మాణాలు జరిగేలా పర్యవేక్షించండి : కమిషనర్ వై.ఓ. నందన్



**నెల్లూరు కార్పొరేషన్,జూన్ 20 ప్రభాతవార్త :** నెల్లూరు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతుల మేరకు మాత్రమే నగరవ వ్యాప్తంగా భవనాల నిర్మాణాలు జరిగేలా ప్రతి ఒక్క వార్డు సచివాలయ ప్లానింగ్ అండ్ రెగ్యులైజేషన్ కార్యదర్శి పర్యవేక్షించాలని కమిషనర్ వై.ఓ నందన్ ఆదేశించారు. వారాంతపు సమీక్షలో భాగంగా టౌన్ ప్లానింగ్ సిబ్బందితో నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాటాడుతూ సచివాలయ పరిధిలో నూతన భవన నిర్మాణాలు జరిగేందుకు ప్లానింగ్ కార్యదర్శులు పూర్తిస్థాయిలో సహకరించాలని, క్షేత్రస్థాయిలో ప్రతిరోజు పర్యటించి నిర్మాణాల పురోగతిని పరిశీలించాలని సూచించారు. అనుమతులకు విరుద్ధంగా నగరంలో నిర్మించిన అన్ని భవనాలకు చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. చార్జిషీట్లలో అన్ని వివరాలను సమగ్రంగా పొందుపరిచి, దాఖలా అనంతరం తీసుకోవాల్సిన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. ఛార్జ్ షీట్ ఆధారంగా కోర్టు మంజూరు చేసిన సమన్లను అక్రమ నిర్మాణాల భవన యజమానులకు స్వయంగా అందజేయాలని కమిషనర్ ఆదేశించారు. సచివాలయం పరిధిలోని అనధికార లేఔట్లను నిర్మాణ స్థాయిలోనే గుర్తించి, అనుమతులు లేని వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్లానింగ్ కార్యదర్శులు డి.పి.ఎమ్.ఎస్ లాగిన్లలో ఉన్న తమ అప్లికేషన్లను 24 గంటల్లో స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుకున్న సమస్యలకు కూడా నిర్దేశించిన సమయంలోపు పరిష్కారాలు అందించాలని కమిషనర్ ఆదేశించారు. సచివాలయం పరిధిలోని అనధికార లేఅవుట్ల క్రయవిక్రయాలపై చర్యలు తీసుకునేందుకు సంబంధిత సబ్ రిజిస్టర్ కార్యాలయంలో వివరాలను తెలియజేయాలని కమిషనర్ ఆదేశించారు .నగరవ్యాప్తంగా పోస్టర్లు, ఫ్లెక్సీలు లేకుండా పర్యవేక్షించాలని, అనుమతులు లేని ప్రచార సామాగ్రిని వెంటనే తొలగించాలని కమిషనర్ ఆదేశించారు. షాపులు దుకాణాలకు సంబంధించిన అడ్వర్టైజ్మెంట్ బోర్డులకు పన్నులు విధించాలని కమిషనర్ తెలిపారు.నగరంలో నెల్లూరు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం వారి అనుమతుల ప్రకారమే భవనముల నిర్మాణం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని, నిర్మాణాలను పిల్లర్ల స్టేజిలోని గుర్తించి అనుమతుల ప్రకారం నిర్మించని సందర్భంలో వెంటనే నిర్మాణ పనులను నిలుపుదల చేయవలసినదిగా ఆదేశించారు.

**డ్రైన్ కాలువలపైన ఉన్న ర్యాంపులు,మెట్లుతొలగించాలి** ప్రధాన డ్రైన్ కాలువలపై ఎలాంటి ర్యాంపులు, మెట్లు తదితర నిర్మాణాలు జరగకుండా పర్యవేక్షించాలని, డ్రైను కాలువల పూడికతీత పనులకు అటువంటి నిర్మాణాలు అడ్డంకిగా మారకుండా పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో సిటీ ప్లానర్ హిమబిందు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఘనంగా కలెక్టరేట్లో రెవెన్యూ దినోత్సవ వేడుకలు




**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 20, ప్రభాతవార్త** ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు రెవెన్యూ దినోత్సవాన్ని జూన్ 20వ తేదిన జిల్లా డివిజన్ మండల స్థాయిలలో ఘనంగా నిర్వహించిన రెవిన్యూ అధికారులు. రెవెన్యూ డే ను జిల్లా మండల స్థాయిలో నిర్వహించడం వలన రెవిన్యూ శాఖ అందిస్తున్న సేవలపై ప్రజలకు, రైతులకు, విద్యార్థులకు మరింత అవగాహన కల్పించేందుకు దోహద పడింది అని.ప్రజలకు జవాబుదారీ, వేగవంతమైన, పారదర్శకమైన పాలన అందించడం ద్వారా రెవెన్యూ శాఖ ఔన్నత్యాన్ని కాపాడతామని రెవెన్యూ సిబ్బంది ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా శాఖ తరుపున ఈ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు రెవెన్యూ దినోత్సవాన్ని జూన్ 20 వ తేదిన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కేంద్రంలోనూ డివిజనల్ కార్యాలయం లోనూ, అన్ని మండల తాసిల్దార్ కార్యాలయాల్లో రెవెన్యూ ఉద్యోగులు ఘనంగా రెవెన్యూ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. జిల్లా కేంద్రముగా కలెక్టరేట్ కార్యాలయము నందు తిక్కన భవనము నందు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జిల్లా జాయింట్ కలెక్టర్ కొల్లా బత్తుల కార్తీక్, జిల్లా రెవెన్యూ అధికారి జే. ఉదయ భాస్కర్, తెలుగు గంగ ప్రాజెక్ట్ స్పెషల్ కలెక్టర్ డి హుస్సేన్, ఏ ఓ విజయ కుమార్ , ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు అల్లంపాటి పెంచలరెడ్డి, కే దానియల్ పేట రావుతో పాటు కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ యొక్క విశిష్టతను రెవిన్యూ ఉద్యోగుల బాధ్యతలను తెలియపరిచారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ రెవెన్యూ శాఖ యొక్క ఔన్నత్యాన్ని కాపాడాలని రెవెన్యూ ఉద్యోగులకు సూచించా రఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు అల్లంపాటి పెంచలరెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగిగా ప్రజలకు సేవ చేసే అరుదైన అవకాశం లభించిందని రెవెన్యూ దినోత్సవం ద్వారా మాకు ఒక వేదికను అందించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు .

ఈ సందర్భంగా రెవిన్యూ ఉద్యోగులందరూ రెవెన్యూ శాఖ గౌరవాన్ని, ప్రజల్లో రెవెన్యూ శాఖ పట్ల నమ్మకాన్ని మరింత పెంచేందుకు భవిష్యత్‌లో ఇంకా జవాబుదారీగా, వేగవంతమైన, పారదర్శకమైన పాలన అందించేందుకు విధి నిర్వహణలో నిబద్ధతతో, తద్వారా రెవెన్యూ శాఖ ఔన్నత్యాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేసారు.



## అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సర్వం సిద్ధం

❖ జిల్లాలో 10లక్షల మందితో సామూహిక యోగా కార్యక్రమాలు ❖ 7000 ప్రదేశాల్లో యోగా సాధనకు ఏర్పాట్లు



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 19, ప్రభాతవార్త :** యోగా అంటే ఆసనాలేనా ! కాదు యోగా అంటే శ్వాస మీద ధ్యాసేనా ! కానే కాదు యోగ అంటే శరీరాన్ని మనసును ఒకటిగా నిలిపి, మనపై మనకు నియంత్రణ కల్పించి, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసంలను పెంపొందిస్తూ ! ఉదాసీనత, ఆత్మనూన్యత, డిప్రెషన్ లను తగ్గించే అద్భుత ఆరోగ్య సాధనం ! నిత్య జీవన విధానం ! ప్రతి రోజూ యోగ సాధన చేస్తే శరీరానికి, మనస్సుకు ఆధ్యాత్మికంగా ఎంతో మేలుచేస్తుంది. నిత్య యవ్వనంతో మొహం తేజోమయంగా కనిపిస్తుంది. ఆసుపత్రులకు పోనవసరం లేని ఆరోగ్య భరోసా లభిస్తుంది.

నిత్యం యోగా సాధన చేస్తే శక్తి, సౌష్టవం మెరుగై శరీర ధృఢత్వం పెరుగుతుంది. శరీరంలో కొవ్వు తగ్గించి, బరువు తగ్గించడంలో సహాయపడుతుంది. మానసిక ప్రశాంతత కలిగి ఒత్తిడిని గణనీయంగా తగ్గిస్తుంది. ఆరోగ్యకరమైన శ్వాస, నిశ్వాసలతో ఊపిరితిత్తుల సామర్థం పెరుగుతుంది. రక్తప్రసరణ బాగా జరిగి హృదయ సంబంధిత వ్యాధుల ముప్పు తగ్గుతుంది. మానసికంగా యోగా చాలా విశేషమైన ప్రయోజనాలను అందిస్తుంది. ఓర్పు, ధైర్యం, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెరుగుతుంది. అదే సమయంలో ఆత్మ నూన్యతభావం, ఉదాసీనత, డిప్రెషన్ తగ్గుతుంది. ఇంతేకాకుండా ఆధ్యాత్మికంగా మానవత్వం, దయ, క్షమ వంటి విలువలు పెరుగుతాయి. ధ్యానం ద్వారా అంతర్గత శాంతి లభిస్తుంది. జీవితతత్వం గురించి అవగాహన పెరుగుతుంది. మానసిక భావోద్వేగాలను నియంత్రిస్తుంది. యోగా చేయడం వల్ల శరీరంలో కార్టిసాల్ అనే ఒత్తిడి హార్మోన్ స్థాయిలు తగ్గుతాయి. నిత్యం యోగా చేస్తూ ఉన్నప్పుడు మనం మన శరీరాన్ని, మనసును వివరంగా తెలుసుకుంటాము. ఇది మనలో స్వీయ విశ్వాసాన్ని పెంపొందిస్తుంది. దాంతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. యోగా వల్ల శరీరంలో సెరోటొనిన్ అనే హ్యాపీ హార్మోన్ విడుదల అవుతుంది. దీనివల్ల డిప్రెషన్, మానసిక అలసట తగ్గుతుంది. ధ్యానం, శ్వాస అభ్యాసాల ద్వారా మనం మనసుపై నియంత్రణ సాధించగలగడం సాధ్యమవుతుంది. ఇది కోపం, అసహనం లాంటి ప్రతికూల భావాలపై నియంత్రణను పెంచుతుంది.



**జిల్లాలో సామూహిక యోగాకు ఏర్పాట్లు పూర్తి**

కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఆదేశాల మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. యోగాను ప్రతిఒక్కరి జీవితంలో ఒక దినచర్యగా మార్చాలన్నదే ప్రధాన లక్ష్యంగా గత నెలరోజులపాటు జిల్లా అంతటా యోగాంధ్ర కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహించారు. పర్యాటక కేంద్రాల్లో మెగా యోగా కార్యక్రమాలు నిర్వహించారు. యోగా గురువులను ఎంపిక చేసి శిక్షణ ఇచ్చారు. నేడు జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవంలో విశాఖపట్టణంలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ప్రముఖులు పాల్గొంటుండగా, జిల్లాలో సుమారు 10లక్షల మంది 7000 ప్రదేశాల్లో సామూహిక యోగాలో పాల్గొనేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తుంది.

## ఘనంగా రెవెన్యూ డే వేడుకలు



**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 20, ప్రభాతవార్త** నెల్లూరులోని ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ నాగ సంతోష్ అనూష నిస్వార్థ సేవలు అందించిన ఇరువురు సీనియర్ ఉద్యోగులను సత్కరించారు. రిటైర్డ్ తహశీల్దార్ రవీంద్రనాథ్‌ను, సీనియర్ తహశీల్దార్ నిర్మలానంద బాబాను ఘనంగా సన్మానించారు. అనంతరం కార్యాలయంలోని ఉద్యోగులతో ఆమె ప్రతిజ్ఞ చేయించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తామని, ప్రజల హక్కుల పరిరక్షణకు చట్టబద్ధంగా న్యాయబద్ధంగా నడుచుకుంటామని తమ కర్తవ్యాలను నిష్టతో నిజాయితీతో నిర్వహిస్తామని ఈ సందర్భంగా తమ కార్యాలయంలోని ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు.

## చిన్న జంతువుల భవనానికి చికిత్స



**నెల్లూరు అగ్రికల్చర్, జూన్ 20, ప్రభాతవార్త** నెల్లూరు రైల్వే ఫ్రైడర్స్ రోడ్డులో ఉన్న పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో గత కొన్నేళ్లుగా చిన్న జంతువుల చికిత్స విభాగానికి చెందిన భవనం అస్తవ్యస్తంగా తయారైంది. శిధిలావస్థలోకి చేరుకుంది. జంతు ప్రేమికులు చికిత్స నిమిత్తం కార్యాలయానికి వచ్చినప్పుడు ఇబ్బందులు పడుతుండేవారు. అలాంటి ఈ భవనానికి మోక్షం కలిగింది. దీనిపై దృష్టి సారించిన పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరక్టర్ ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. ఐదు లక్షల 50 వేల రూపాయల ఖర్చుతో ఈ చిన్న జంతువుల చికిత్స భవనాన్ని రూపు రేఖలు మార్చారు. శుక్రవారం ఇందుకోసం నిర్మించిన సముదాయాన్ని ఫ్లోరింగ్‌ను పశుసంవర్ధకశాఖ డీడీ సోమయ్య, సంయుక్త సంచాలకులు కే.రమేష్ నాయక్, సంచాలకులు టి.దామోదర్ నాయుడు ఈ సముదాయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ శాఖ డీడీ సోమయ్య మాట్లాడుతూ ప్రభుత్వ నిధులు మూడు లక్షల 50 వేలతో పాటు చిన్న జంతువుల సంరక్షకులు ఉమాదేవి, వెంకటేశ్వర్లు తమ వంతు సహాయంగా 2 లక్షల రూపాయలను అందజేశారని దీంతో చిన్న జంతువుల చికిత్స విభాగం పూర్తిగా నిర్మించామని చెప్పారు.

## జగన్ పాలన చీకటి కాలం.. రాష్ట్ర ప్రజలు విస్మరిస్తున్నారు

- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి తీవ్ర విమర్శలు
- జగన్‌కు శేష జీవితం కొబ్బరిబోండాలు నరకడానికే
- వైసీపీ పాలనలో అవినీతి, అరాచకం రాజ్యం
- పోలీసులను రాజకీయ సేవకులుగా మార్చారు
- నూతన శిఖరాలకు ఆంధ్రప్రదేశ్.. బీజేపీ కూటమితో అభివృద్ధి హామీ
- రాష్ట్రాన్ని అభివృద్ధి మార్గంలో నడిపిస్తున్న మోడీ ప్రభుత్వం
- భాను ప్రకాశ్‌రెడ్డి



**నెల్లూరు, జూన్ 20, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు నగరంలోని, రామ్మూర్తి నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రిక విలేకర్ల సమావేశానికి బీజేపీ జిల్లా అధ్యక్షులు సిపారెడ్డి వంశీధర్‌రెడ్డి అధ్యక్షత వహించగా, ముఖ్య అతిధిగా టీటీడీ బోర్డు మెంబర్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి జీవితాంతం కొబ్బరిబోండాలు నరికే దానికి, పరోటా పిండి పిసికే దానికే మీ శేష జీవితం దానికే సరిపోతుందని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ పాలనపై బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి నిప్పులు చెరిగారు. గత ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలన రాష్ట్రానికి చీకటి రోజులను తీసుకొచ్చిందని, ప్రజలు ఆయన నాయకత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఆయన మండిపడ్డారు. జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయ విధానాలు, నాయకత్వ లోపాలు రాష్ట్రానికి తీరని నష్టాన్ని కలిగించాయని ఆయన దుయ్యబట్టారు. గత ఐదేళ్లలో జగన్‌రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ అవినీతి, అరాచకాలకు నియలంగా మారిందని, ప్రజలు తమ గుండెల్లో స్థానాన్ని కోల్పోయిన నాయకుడిగా జగన్‌ను చూస్తున్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు గాలిలో కలిసిపోయాయి. అవినీతి రాజ్యమేలిందని అని భాను ప్రకాష్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లలో జగన్ ప్రజల గుండెల్లో స్థానాన్ని కోల్పోయారు. ఆయన రాజకీయ విధానాలు ప్రజలకు అన్యాయమే చేశాయి. ప్రజలు ఆయన నాయకత్వాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు అని భాను ప్రకాష్‌రెడ్డి అన్నారు. పోలీసులను రాజకీయ సేవకులుగా మార్చేశారు. ప్రజలకు కాకుండా అధికార పార్టీకి సేవ చేసే ధోరణి పెరిగింది. ఇది సాధారణ ప్రజలకు భయాన్ని కలిగిస్తూ రౌడీ మనస్తత్వాలను పెంచుతోంది అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. శాంతి భద్రతలకు చెడు దారిన పడ్డాయని, చేసిన ప్రచారాలు రాష్ట్ర స్థిరత్వాన్ని దెబ్బతీశాయని చెప్పారు. జగన్ చుట్టూ ఉన్న నమ్మిన నేతలు, అధికారులు దూరమవుతున్నారు. రాజకీయ పరిణామాల్లో ఆయన ఒంటరిగా పోరాడుతున్నట్లు కనిపిస్తోంది. ఇది పార్టీ బలహీనతకు దారి తీస్తుందని భాను ప్రకాష్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. గతంలో జరిగిన శాంతి భద్రతలను కలవరపెట్టే చర్యలు రాజకీయ ప్రయోజనాల కోసం ప్రత్యేకంగా ప్లాన్ చేసినట్లు స్పష్టమవుతోంది. ప్రజలలో అనిశ్చిత, ఆందోళనలు పెరిగాయి. ఆంధ్రప్రదేశ్ శాంతిని దెబ్బతీసిందని ఆయన విమర్శించారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని భారతీయ జనతా పార్టీ(బీజేపీ), తమ కూటమి ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, శాంతిని తీసుకురావడానికి కట్టుబడి ఉన్నాయని స్పష్టం చేశారు. కేంద్ర పాలక శాఖతో సమన్వయంగా పని చేస్తూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి మార్గంలో ఉంది. రూరల్ పోర్ట్, రోడ్డు కనెక్టివిటి సహా మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాలు అందుబాటులోకి రావడం, పోర్టుల అభివృద్ధి, పరిశ్రమల ప్రోత్సాహం ద్వారా పెద్ద సంఖ్యలో ప్రజలకుఉపాధి సృష్టిస్తాం అని ఆయన హామీ ఇచ్చారు. రౌడీ సాంస్కృతిక, అంతిమంగా చరమగీతం పాడతాం, చట్టాన్ని గట్టిగా అమలు చేయడం ద్వారా ఎవరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా చూస్తాం అని భాను ప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. జగన్‌రెడ్డి, వైసీపీ పార్టీలో ఉన్న అనేక అనుమానస్పద వ్యవహారాలపై సంబంధిత అధికారులతో సహా అడుగడుగునా సక్రమ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. వెలుగులోకి తీసుకురావాల్సిన అంశాలు ప్రజల ముందు ఉంచుతాం అని అన్నారు. జగన్‌రెడ్డి తన విధానాలను సరిదిద్దుకోకపోతే రాజకీయంగా వైఫల్యం ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం ప్రజల మద్దతుతో అభివృద్ధి పనులకు శ్రద్ధ చూపుతుంది. చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ వంటి అనుభవజ్ఞుల సహకారంతో రాష్ట్రం నూతన శిఖరాలను అధిరోహిస్తుం దని భాను ప్రకాష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు నరసింహనాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శిలు యారబోలు రాజేష్, యశ్వంత్ సింగ్, జిల్లా కార్యదర్శి చిలక ప్రవీణ్ కుమార్, నెల్లూరు రూరల్ కన్వీనర్ మండ్ల ఈశ్వరయ్య, ఓబీసీ మోర్చా జోనల్ ఇన్‌ఛార్జీ ముక్కు రాధాకృష్ణ గౌడ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ప్రసాద్, మండల అధ్యక్షులు మింగా కిరణ్, మదన్ సాయిరెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ముని సురేష్, బీజేపీ సీనియర్ నాయకులు హరినాథ్‌రెడ్డి, నారాయణ, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## వర్క్ ఆర్డర్లపై రివ్యూ సమావేశం





**నెల్లూరు, జూన్ 20, ప్రభాతవార్త-వైద్యం** విద్యుత్ భవన్‌లోని స్కాడా కార్యాలయంలో వర్క్ ఆర్డర్లపై జిల్లాసూపరింటెండింగ్ ఇంజనీర్ వి.విజయన్ జిల్లాలోని అన్ని డివిజన్‌ల ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లతో, సంబంధిత జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్లతో వర్క్ ఆర్డర్‌లపై రివ్యూ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ 2022-23 సంవత్సరంకు సంబంధించి పెండింగ్, వర్క్ వర్డర్లను ఈ నెలాఖరు లోపల క్లియర్ చేయకపోతే సంబంధిత అధికారుల జీతాల నుండి రికవరీ ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లాలోని ఐదు డివిజన్లలో యుద్ధ ప్రాతిపదికన 2022-23 ఆర్థిక సంవత్సరం సంబంధించిన వర్క్ ఆర్డర్‌లను ఈ నెలాఖరి లోపల పూర్తి చేయాలని, లేనిచో రేపు నెల నుంచి వారి జీతాలలో రికవరి ఉంటుందని తెలిపారు. ఆత్మకూరు డివిజన్లో 2022-23 సంవత్సరాలు సంబంధించి 398 వర్క్‌లు పెండింగ్ ఉన్నాయని, కావలి డివిజన్‌కు సంబంధించి 89 వర్క్ ఆర్డర్స్ పెండింగ్లో ఉన్నాయని, కోవూరు డివిజన్ సంబంధించి 134 వర్క్ ఆర్డర్స్ పెండింగ్లో ఉన్నాయని, నెల్లూరు టౌన్ డివిజన్‌కు సంబంధించి 14 పెండింగ్లో ఉన్నాయని, నెల్లూరు రూరల్ డివిజన్‌కు సంబంధించి 147 వర్క్ ఆర్డర్స్ పెండింగ్లో ఉన్నాయని మొత్తంగా సర్కిల్లో 782 వర్క్ ఆర్డర్స్ 2022-23 ఆర్థిక సంవత్సరానికి పెండింగ్లో ఉన్నాయని, వీటి విలువ సుమారు 13 కోట్ల మేరకు ఉంటుందని తెలిపారు. ఏఈలు వర్క్ ఆర్డర్స్ పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉన్నారని ఇది మంచి పద్ధతి కాదని తెలియజేశారు. ఈ సమావేశంలో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ పి.మురళి, నోడల్ ఆఫీసర్ బాల చంద్ర, అకౌంట్ ఆఫీసర్ విజిత, ఏఏఓలు జెఏవోలు సంబంధించిన సిబ్బంది పాల్గొన్నారు.

## రెవెన్యూలో ఉద్యోగం రావడం అదృష్టం



**కోవూరు, జూన్20 ప్రభాతవార్త :** ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే రెవెన్యూ శాఖలో ఉద్యోగం రావడమే అదృష్టమని తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం రెవెన్యూ డే సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శాఖలో పనిచేసే ప్రతి ఉద్యోగి అర్హత కలిగిన వారికి ప్రభుత్వ పథకాలు అందించడంలో ఎంతో తృప్తి కూడా ఉంటుందన్నారు. ఇటువంటి రెవెన్యూ శాఖలో పనిచేయడమే ఉద్యోగుల అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రభుత్వం జూన్ 20వ తేదిన రెవెన్యూ డేగా నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వడం పట్ల ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. ఎంపీడీవో శ్రీహరిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వంలో ఎన్ని శాఖలు ఉన్నా రెవెన్యూ శాఖకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. రెవెన్యూ శాఖతో అన్ని శాఖలు అనుసంధానంగా ఉంటున్నాయన్నారు. ప్రస్తుతం రెవెన్యూ శాఖలో చేరే ఉద్యోగులు గతంలో పనిచేసి పదవీ విరమణ చేసిన రెవెన్యూ అధికారుల సలహాలు సూచనలు తప్పక తీసుకోవాలన్నారు. రెవెన్యూ శాఖ అనేది అతి పురాతనమైనదని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రతి మండలంలో తహసీల్దార్ , ఎంపీడీవోలు ప్రతి రోజూ ఏదొక సందర్భంలో మాట్లాడుకుంటూనే ఉంటార న్నారు. అటువంటి రెవెన్యూ శాఖకు ఒక రోజు కేటాయించి దానిని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం శుభపరిణామం అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు బషీర్, సురేష్, మధుసూదన్‌రావు, రిటైర్డ్ తహసీల్దార్ సురేంద్ర, మండల సర్వేయర్ రమేష్ గౌడ్, గ్రామ రెవెన్యూ అధికారి నాగేశ్వరరావు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ఉద్యోగులు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, డీలర్లు ఉన్నారు.

## తహసిల్దారు కార్యాలయంలో రెవిన్యూడే



**చేజర్ల జూన్ 20 ప్రభాతవార్త :** చేజర్ల తహసిల్దారు కార్యాలయంలో తహసిల్దారు బి .మురళీ అధ్యక్షతన శుక్రవారం రెవిన్యూడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దారు సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించి పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం గ్రామ రెవిన్యూ అధికారిని సన్మానించడం జరిగింది. ఈకార్యక్రమంలో రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## తల్లికి వందనం- తల్లిదండ్రులలో హర్షం



**బుచ్చి జూన్ 20 ప్రభాతవార్త :** బుచ్చిరెడ్డిపాళెం శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో తల్లికి వందనం అందుకున్న తల్లిదండ్రులు చాలా సంతోషాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం పాఠశాలలు తెరిచిన తర్వాత డబ్బులు వేస్తున్నందున మా పిల్లలకు కావలసిన పుస్తకాలు యూనిఫాంలు కొనుక్కోవ డానికి మాకు చాలా సులభమైనదని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి దన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్ మాట్లాడుతు మా పాఠశాలలో అర్హులైన 90 శాతం మందికి తల్లికి వందనం వచ్చిందని తల్లులందరు ఈ యొక్క డబ్బులను మీ పిల్లల విద్యకోసం ఖర్చుపెట్టి మన ఆంధ్రప్రదేశ్ విద్యలో ఉన్నత స్థానంలో ఉండడానికి ప్రభుత్వం చేస్తున్న కృషికి మనమందరం సహరిద్దాం. ఈ కార్యక్రమంలోప్రిన్సిపల్ సురేఖ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ధార్మిక సంస్థల స్థలాలను ప్రయివేట్ వ్యక్తులకు కట్టబెట్టడం దారుణం

## ఆశ్రమస్థల లీజుపై స్థానికలు ఆందోళలకు జనసేన మద్దతు



**నెల్లూరు,జూన్20 ప్రభాతవార్త విద్య :** ధార్మిక సంస్థలకు చెందిన స్థలాలను భక్తులకు, ప్రజలకు తెలియకుండా ఎండోమెంట్ అధికారులు అతిత క్కువ నగదుకు లీజులకు ఇస్తూ ప్రయి వేట్ పరంచేయటం దారుణమని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యద ర్శి గునుకుల కిషోర్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని స్థానిక ఐదవ డివిజన్ సత్యనారాయణపురం పరిధిలోని శ్రీ భరద్వాజ ఆశ్రమంలోని కృష్ణమందిరం, ఉమామహేశ్వర ఆలయాలకు సంబందించి రూములను లీజు విషయమై స్థానికులు చేస్తున్న పోరాటాల్లో భాగంగా స్థానికుల ఆహ్వానం మేరకు గునుకుల ఆ శ్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గునుకుల మాట్లాడుతు భక్తుల విరాళాలు, చందాలతో జరుగుతున్న దైవ్యకార్యక్రమాలను అడ్డుకోవటం మంచి పద్ధతి కాదన్నారు. స్థానికుల ఆహ్వానం మేరకు తాము ఇక్కడికి రావటం జరిగిందన్నారు. స్థానికులు అనేక సంవత్సరాల నుండి ఈ ప్రాంతంలో పూజలు, హోమాలు, ధార్మిక కార్యక్రమాలు చేసేకునేందుకు వినియోగించేవారాన్నరు. కానీ ఎండోమెంట్ అధికారులు ఎవ్వరికి తెలియకుండా వేలం నిర్వహించి ఓ ప్రయివేట్ పాఠశాలకు రూములను లీజుకు ఇవ్వటం జరిగిందన్నారు. లీజు దారులు ఆలయ సామానులను రూం లో వేసి భక్తులకు అసౌకర్యాలు కలిగిస్తున్నాని తమ దృష్టికి వచ్చిందన్నారు. లీజుదారులు మూడు సంవత్సరాల తరువాత కూడా ఇ స్థలాని ఖాళీచేస్తారని తమకు నమ్మకం లేదన్నారు. ఇదే విషయాన్ని మంత్రి నారాయణ ధృష్టికి తీసుకువెల్లామని, అలాగే తమ పార్టీ జాతీయ మీడియా ప్రతినిధి, రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ దృష్టికి కూడా తీసుకువెల్లి, దార్మిక సంస్థలు, ఆశ్రమాలు, పూజామందిరాలు ప్రయివేట్ వ్యక్తుల పరం కాకుండా చర్యలు తీసుకునేందుకు పాటుపడతామన్నారు. వేలం పాటలో పాల్గొని లీజుదారులు ఆ ప్రాంతాన్ని పాడుకున్నపట్టికి భక్తులు, స్థానికుల మనోభావాలను కూడా పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నేటి యోగాంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



**రాపూరు, జూన్20ప్రభాతవార్త :** రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శనివారం నిర్వహిస్తున్న యోగాంధ్రా కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలని రాపూరు మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారిణి మారెళ్ళ భవానీ కోరారు. శుక్రవారం ఆమె తన కార్యలయంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని 18 సచివాలయల పరిధిలో 150 సెంటర్లలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి సచివాలయం పరిధిలో 9 యోగా సెంటర్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ యోగాంధ్రా కార్యక్రమానికి విశాఖ పట్టణంలో దేశ ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కోణిదల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొంటారన్నారు. వీరి యోగా కార్యక్రమాన్ని ప్రతి సచివాలయంలో ప్రత్యేకంగా లైవ్‌లో ప్రొజెక్టర్‌లు ఏర్పాటు చేసి ప్రదర్శించడం జరగుతుందన్నారు. మండలంలోని అందరూ ప్రభుత్వ, ప్రవేటు ఉద్యోగులు, యువత, ప్రజా ప్రతినిధులు తప్పని సరిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## మోడీ పాలనతోనే దేశం అభివృద్ధి చెందిందని బిజేపి కన్వీనర్ కె.రవీందర్ రెడ్డి పేర్కొన్నారు.



**వెంకటాచలం జూన్ 20 ప్రభావత వార్త:** భారత దేశ గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారు 11 సంవత్సరాలు పరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా భారతీయ జనతా పార్టీ వెంకటాచలం మండల పార్టీ ఆఫీసులో మండలాధ్యక్షులు అసనాపురం శ్రీనివాసులు గారి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి సర్వేపల్లి అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ కె.రవీందర్ రెడ్డి గారు మరో ముఖ్య అతిథి బిజెపి సీనియర్ నాయకులు కుంచి శ్రీనివాసులు యాదవ్ గారు పాల్గొన్నారు ఈరోజు ప్రభుత్వ హాస్పిటల్ లో డాక్టర్ గారి సమక్షంలో మొక్కలు నాటించడం జరిగినది అదేవిధంగా ఈ 11 సంవత్సరాలు భారత ప్రధాని నరేంద్ర మోడీ గారు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు ఏవైతే ఉన్నాయో ఆ కార్యక్రమాల్ని ప్రజలకు చేరవేసే విధంగా కమిటీలు వేసుకొని ఆ యొక్క ప్రభుత్వ పథకాలు ప్రజలకు తెలియజేయడానికి ప్రతి కార్యకర్త ఒక సైనికులుగా పనిచేయాలని పార్టీ ఆఫీసులో ఈ యొక్క కార్యక్రమాలు మీద ప్రచారం చేసి ఆ యొక్క అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరే విధంగా చేస్తారని మేము ప్రతిజ్ఞ కూడా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీ రాష్ట్ర నాయకులు ఆరుమూల మురళి మరియు మండల యువమోర్చా ప్రెసిడెంట్ గొత్తల నరేష్ గారు, మండల ఉపాధ్యక్షులు మాధవ్, గారు ఎస్సీ మోర్చా అధ్యక్షులు కరీముల్లా గారు, బిజెపి నాయకులు పంది శ్రీహరి గారు, దయాకర్ గారు గిరి మహేష్ గారు ఈదురు చంద్ర గారు ,సుధాకర్ గారు మరియు భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలు ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది

## ఏడీని అభినందించిన సొసైటీ సీఈవో



**కోవూరు, జూన్20 ప్రభాతవార్త :** కోవూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులుగా బాధ్యతలు చేపట్టిన అనితను పడుగుపాడు సహకార సొసైటీ సీఈవో గోవర్ధన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, స్వీట్లతో అభినందించారు. ఈ సందర్భంగా వారు సొసైటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఏడీకి వివరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉద్యోగి శివకుమార్, తదితరులు ఉన్నారు.

## ఎస్సీ,ఎస్టీకాలనీలకు మౌలిక వసతులు కల్పించాలి



**కావలిరూరల్, జూన్20 ప్రభాతవార్త :** సమాజంలో నిరుపేదలైన షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు నివసిస్తున్న కాలనీలకు మౌలికవసతులు కల్పించి ప్రతి కాలనీకి సామాజిక భవనాన్ని నిర్మించి వారిలో చైతన్యాన్ని పెంపొంది ంచాలని జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి విజిలెన్స్ మానిటరింగ్ కమిటి మాజీ సభ్యులు ఎం.మాలకొండారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఆయన కావలి ముసునూరు మర్రిచెట్టు గిరిజన కాలనీనందు శుక్రవారం మాట్లాడారు. సంక్షేమపథకాలపై అధికారులు ఈ కాలనీలను సందర్శించి వారి అభ్యున్నతికి నిరంతరం కృషిచేసి వారిని అభివృద్ధిచేయాలని కోరారు. ఐటిడిఎ అధికారులు గిరిజన కాలనీలను సందర్శించి గిరిజన సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. బడిబయట తిరుగుతున్న బాలబాలికలను పాఠశాలల్లో చేర్పించి వారికి విద్యాబుద్ధులు అందించాలని తెలియచేశారు. ప్రజాప్రతినిధులు నిరంతరం నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీకాలనీల ప్రజలను చైతన్యపరచి రాజ్యాంగ నిర్మాతలు కలలుగన్న నవసమాజాన్ని నిర్మించడానికి నిరంతరం కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన చైతన్యసమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జయంపు కనకయ్య పాల్గొన్నారు.

## విఆర్వోలుకు సన్మానం తహసిల్దార్ స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు,జూన్ 20 ప్రభాతవార్త:** మండలం వీఆర్వోలుగా పనిచేస్తు పదవి విరామం పొందిన వారికి స్థానిక తహసిల్దార్ స్ఫూర్తి రెడ్డి ఆధ్వర్యంలో వీఆర్వోలు రఘునందన్ రెడ్డి, రఘునందన్ రావు, కృష్ణయ్య, అటెండర్ గౌస్ మతిద్దీన్ లకు ఘన సన్మానం చేశారు. ఈ సందర ్భంగా రెవెన్యూ గ్రామ వీఆర్వోలుగా పనిచేస్తున్న వారికి రెవెన్యూ డే సందర్భంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సారం గపాణి, ఏఎస్‌ఓ గాయత్రి, మండల సర్వేయర్, ఆర్ ఐ, వీఆర్వోలు వెంకటేశ్వర్లు, సుబ్బయ్య, కొడవలూరు శ్రీనివాసరావు, యు.సురేష్, జూనియర్, సీనియర్, అసిస్టెంట్లు సిబ్బంది ప్రసన్న ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రెవెన్యూ డే స్ఫూర్తి రెడ్డి



**కొడవలూరు, జూన్ 20, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న రెవెన్యూ డే సందర్భంగా తహసిల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి ఆధ్వర్య ంలో తహసిల్దార్ కార్యాలయంలో రెవెన్యూ డే కార్యక్రమం వేడుకగా శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో రెవెన్యూ సేవలు అందించిన దినముగా రెవెన్యూ డే చాలా సంతోషకరమైన విషయమని తెలిపారు. అంతకుముందు పదవి విరమణ పొందిన విఆర్‌ఓలకు సన్మానం చేసి తహసిల్దార్ సత్కరించారు. అనంతరం రెవెన్యూ డే సందర్భంగా కేక్ కట్ చేసి సిబ్బందికి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ సారంగిపాణి, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం



**కావలిరూరల్, జూన్20 ప్రభాతవార్త :** 11వ అంతర్జాతీయ యోగాదినోత్సవం సందర్భంగా కావలి పట్టణంలోని మినీ స్టేడియం నందు కావలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఉదయం 6 గంటలకు నిర్వహించే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి శుక్రవారం పిలుపునివ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రఅభివృద్ధి ప్రదాత రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరిగే యోగాడే కార్యక్రమానికి దేశప్రధాని నరేంద్రమోడి రానున్నారని తెలియచేశారు. కావలి ప్రాంతంలో జరిగే ఈ యోగాడేను విజయవంతం చేద్దామని కోరారు. ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగా చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియచేశారు. యోగాతో శారీరక ధృఢత్వం, మానసిక వికాసం, శరీరపరిపుష్ఠిత కలగడమే కాకుండా మానసిక ఒత్తిడినుంచి త్వరితగతిన బయటపడే ఒక గొప్ప విద్య అని తెలిపారు. రోజుకు 30 నిముషాలపాటు మనందరం యోగా చేయగలిగితే సగం వ్యాధులు మనకు తగ్గుతాయని చరిత్ర చెబుతుందని తెలియచేశారు. అందుకనే మన రాష్ట్రముఖ్యమంత్రి ఈ రోజు యోగాని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రతి ఇంటా యోగా సాధనను నిర్వహించాలని తెలియచేశారు. ప్రజలు ప్రశాంతంగా జీవించాలని, ఆరోగ్యవంతంగా జీవించాలని, మానసిక ఒత్తిడికి లోనుకాకుండా సుఖంగా జీవించడం కొరకు యోగా ఒక వైద్యంగా భావించాలని తెలిపారు. కావలిలో నిర్వహించే యోగాలో నియోజకవర్గ ప్రజలు, ఉద్యోగస్తులు, రాజకీయపార్టీలకు అతీతంగా అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

## రాపూరులో ఘనంగా రెవెన్యూ డే వేడుకలు



**రాపూరు,జూన్20ప్రభాతవార్త :** మండల కేంద్రమైన రాపూరులోని రెవెన్యూ కార్యలయంలో శుక్రవారం రెవెన్యూ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశిల్దార్ లక్ష్మీ నరసింహం ప్రజలకు రెవెన్యూ అందిస్తున్న సేవలను వివరించారు. ప్రజా జివితంలో ప్రతి ఒక్కరికి ఎదో ఒక రెవెన్యూ అవసరాలు వుంటాయాని, రెవెన్యూ సేవలు నిత్యం ప్రజలకు అందిస్తుతూ రెవెన్యూ సిబ్బంది ప్రజా సేవలోనే వుంటారన్నారు. అనంతరం తహశిల్దార్ లక్ష్మీ నరసింహం, డిప్యూటీ తహశిల్దార్ అశోక్, మండల సర్వేయర్ శ్రీనివాసులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ రెవెన్యూ అధికారులు, కార్యలయం సిబ్బంది వున్నారు.

## వింజమూరు తెలుగుదేశం మండల కన్వీనర్‌గా గూడా



**వింజమూరు, జూన్ 20, ప్రభాతవార్త :** వింజమూరు మండల తెలుగుదేశం కన్వీనర్‌గా గూడా నర్సారెడ్డి పేరును మండల నాయకత్వం ఏకగ్రీవంగా ఆమోది ంచడంతో గురువారం తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన మండల కమిటీ ఎన్నికలలో పరిశీల కులు రవిచంద్ర ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అధ్యక్షతన కమిటీ సమక్షంలో ఏకగ్రీవంగా గూడా నర్సారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన పేరును కమిటీ తీర్మానం చేసి అధిష్టానానికి పంపించడం జరిగింది. అధిష్టానం ఆమోదం తర్వాత అధికారికంగా ప్రకటించడం జరుగుతుందని మండల పార్టీ కార్యాలయం తెలిపింది. అలాగే మండల ప్రధాన కార్యదర్శిగా చల్లా శ్రీనివాసులు యాదవ్, మంచాల శ్రీనివాస్ నాయుడు పేర్లను మండల నాయకత్వం ఆమోదించింది. వీరి పేర్లు కూడా అధిష్టానం ఆమోదించడంతో ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా పలువురు తెలుగుదేశం నాయకులు గూడాను ఘనంగా సన్మానించారు. తమ అభినందనలను తెలియజేశారు. ఈ సందర్భంగా గూడా నర్సారెడ్డి మాట్లాడుతూ తాను 2021 నుండి 2022 సంవత్సరం వరకు మండల పార్టీ కన్వీనర్‌గా పని చేయడం జరిగిందని, పార్టీలోని సీనియర్లు సూచనలు సలహాలు పాటిస్తూ పనిచేయడం జరిగిందన్నారు. నేడు మరలా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తనపై ఉంచిన కన్వీనర్ బాధ్యతలు బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తూ ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పార్టీలోని సీనియర్లు జూనియర్లను కలుపుకొని పార్టీ బలోపేతంకు కృషి చేస్తానన్నారు.

## కిచెన్ గార్డ్ ఏర్పాటుకు చర్యలు



**కోవూరు, జూన్20 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో ఏపీడబ్ల్యూఐడీసీ శాఖ ద్వారా కిచెన్ గార్డ్ ఏర్పాటుకు స్థల పరిశీలన శుక్రవారం జరిగిందని ఏపీఎస్‌డబ్ల్యూఐసీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎన్. మహేంద్ర అన్నారు. స్థానిక పాఠశాల ప్రాంగణంలో కిచెన్ గార్డ్ ఏర్పాటుకు ఏ ప్రాంతమైతే బాగుంటుందో ఆ స్థలాలను ఏఈ ప్రవీణ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిచెన్ గార్డ్ ఏర్పాటుకు అవసరమైన అన్ని సౌకర్యాలను తమ శాఖ ద్వారా చేపట్టడం జరుగుతుందన్నారు. వీటిని విద్యార్థులు, ఉపాధ్యాయులు సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి, ఫిజికల్ డైరెక్టర్ పి. సులోచన, పీఈటీ వెంకటసుబ్బమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



**కొడవలూరు, జూన్ 20, ప్రభాతవార్త:** జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి వివరాలు హైదరాబాద్ నుండి తిరుపతి వెళుతున్న కారు మండలంలోని రేగడిచెలిక సమీపంలో వచ్చేసరికి రోడ్డు ప్రక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో అక్కడికక్కడే ఒకరు మృతి నలుగురికి, మిగిలినవారికి స్వల్ప గాయాలు కావడంతో గుర్తించిన మొబైల్ సిబ్బంది 108 ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## పులి వాహనంపై రామలింగేశ్వరుడు

**విడవలూరు, జూన్ 20, ప్రభాతవార్త:** మండలం రామతీర్థం గ్రామంలో వెలసియున్న శ్రీ కామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రామలింగేశ్వర స్వామి పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చకులు వివిధ రకాల పూజ కార్యక్రమాలు చేయడం జరిగింది. రాత్రి పూ లంకరణ స్వామి అమ్మవార్లకు చేయడంతో శివపార్వతులు ప్రత్యక్షమైనట్లు తిలకించిపోయారు. పురవీధుల్లో స్వామి అమ్మవారుల గ్రామోత్సవం మంగళ వాయిద్యాలు నడుమ ఘనంగా చేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా బలిజ సంఘం వ్యవహరించారు. ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ, చైర్మన్ సురేష్, ఆలయ నిర్వహణ అధికారి మల్లికార్జున్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ బెల్లంకొండ వెంకటేశ్వర్లు, పాలక మండల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆశావర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలంటే వినతి

**నెల్లూరు, జూన్ 20, ప్రభాతవార్త-వైద్యం :** ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వడంతో పాటు, వారిని కార్మికులుగా గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ సుజాతకు ఆశా వర్కర్ల సమ్మెపై డిమాండ్ నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణమ్మ మాట్లాడుతూ ఆశా వర్కర్ల సమస్యలు చాలా కాలంగా పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఆశాల సమస్యల పరిష్కారానికై జులై 9న దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా నెల్లూరులో ఆందోళన నిర్వహిస్తామని చెప్పారు. కనీస వేతనం కార్మికులుగా గుర్తింపు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కోరుతూ, అన్ని ట్రేడ్ యూనియన్లను కలుపుకొని సమ్మె నిర్వహిస్తామని చెప్పారు. అంతే కాకుండా ఆశా వర్కర్లకు అదనపు బాధ్యతలను అప్పగించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఆశాలు టీబీ సర్వే, లెప్రసీ సర్వే, సీజనల్ వ్యాధులపై సర్వే, మలేరియా సర్వే, నూతన దంపతులకు గుర్తింపు, బాలింతలు, గర్భిణీల గుర్తింపు మొదలగు ఇన్ని విధులు నిర్వహిస్తున్నా మెడికల్ ఆఫీసర్స్ టీబీ సంబంధిత గల్ల పరీక్షలు కూడా చేయాలని చెప్పడం సరైన చర్య కాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే.విజయలక్ష్మీ, కోశాధికారి మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలనలో రెవెన్యూ శాఖ కీలకపాత్ర వహిస్తుంది



**ఉదయగిరి, జూన్ 20, ప్రభాతవార్త :** ప్రజా పాలనలో రెవెన్యూ శాఖ కీలకపాత్ర వహిస్తుందని ఉదయగిరి ఆర్వో ఏ.మురళి తెలిపారు. శుక్రవారం ఉదయగిరి ఎమ్మార్వో కార్యాల యంలో రెవెన్యూడే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కరోనా, ప్రకృతి, విపత్తులు, ప్రమాదాలు వంటి సందర్భాల్లో రెవెన్యూ శాఖ చాలా కీలకపాత్ర వహిస్తుందన్నారు. రెవెన్యూ ప్రతిక్షణం ప్రజా సేవలో ఉన్నందున జూన్ 20వ తేదీన రెవెన్యూ డే జరుపుకుంటున్నామన్నారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఎల్.రామ్మోహన్, రెవెన్యూ సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

## రామయ్యకు నివాళులర్పించిన కావలి ఎమ్మెల్యే దగుమాటి



**కావలిరూరల్, జూన్20 ప్రభాతవార్త :** ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తండ్రి కంచర్ల రామయ్య భౌతికకాయాన్ని కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి శుక్రవారం కందుకూరులోని ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో సందర్శించారు. అనంతరం ఆయన భౌతికకాయానికి పూలమాలలువేసి ఘనంగా నివాళుల ర్పించారు. కంచర్ల శ్రీకాంత్‌ను పరామ ర్శించి తన ప్రగాఢసానుభూతిని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గ లీగల్‌సెల్ అధ్యక్షులు గుంటుపల్లి రాజ్‌కుమార్‌చౌదరి, సోమశిలప్రాజెక్టు మాజీ చైర్మన్ కండ్లగుంట మధుబాబానాయుడు, టిడిపి నాయకులు తిరివీధి ప్రసాద్, దావులూరి దేవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేని లేఅవుట్లలోని ప్లాట్లు కొనుగోలు చేయకూడదు

### - కమిషనర్ వై. ఓ నందన్ వెల్లడి.

**నెల్లూరు కార్పొరేషన్,జూన్ 20 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు అక్రమ లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేయకూడదని ,అటువంటి లేఅవుట్లలలో భవన అనుమతులు పొందుట వీలుకాదని ఆ లేఅవుట్ ప్లాట్లకు సంబంధించి బ్యాంకులు ద్వారా రుణాలు మంజూరు కావని కొనుగోలుదారులు తప్పుడు యాజమాన్య హక్కుల వివాదాలకు, ద్వంద్వ రిజిస్ట్రేషన్లకు చట్టపరమైన వివాదాలకు గురయ్యే అవకాశం ఉందని ఇటువంటి పరిణామాలను నివారించడానికి, ప్రజలు రేరా లో నమోదు చేయబడిన లేఅవుట్లలో మాత్రమే ప్లాట్లు కొనుగోలు చేయాలి కార్పొరేషన్ కమిషనర్ వై. ఓ నందన్ ఒక ప్రకటన లో శుక్రవారం తెలిపారు. అక్రమ లేఅవుట్లను అరికట్టే ప్రయత్నంలో భాగంగా, పట్టణ మరియు గ్రామీణ ప్రణాళికి సంచాలకులు (డీటీసీపీ) కార్యాలయంలోని సీనియర్ అధికారులు, ప్రాంతీయ పట్టణ మరియు గ్రామీణ ఉప సంచాలకులు (ఆర్డీడీటీపీలు), పట్టణ అభివృద్ధి సంస్థ ( యూడీఏ) అధికారులు ,మున్సిపాలిటీ/ మున్సిపల్ కార్పొరేషన్ (యూ ఎల్ బి) పట్టణ ప్రణాళిక అధికారులు కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా, డీటీసీపీ కార్యాలయానికి తరచుగా ఫిర్యాదులు వచ్చాయి అని ఆకస్మిక తనిఖీలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ తనికీలలో భాగంగా, నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో పేర్కొన్న అనధికార లేఅవుట్లను గుర్తించడం జరిగినది, గుర్తించిన అనధికార లేఅవుట్లను ఏపీ మునిసిపల్ కార్పొరేషన్ చట్టం, 1955 ప్రకారం డిటిసిపి సిబ్బంది, మున్సిపల్ అధికారుల సమక్షంలో చర్యలు తీసుకోబడనునట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ లే ఔట్స్ రూల్స్ 2017 ను అనుసరించి అనధికార లే అవుట్లలోని ప్లాట్లపై ఎలాంటి కొనుగోలు, అమ్మకం, లావాదేవీలు జరగకుండా, రిజిస్ట్రార్, నెల్లూరు విద్యుత్ శాఖ వారికి సూచనలు జారీ చేయడమైనదని హెచ్చరించారు. ఎలక్ట్రిసిటీ కనెక్షన్లు ఇవ్వకుండా ఎలక్ట్రికల్ శాఖ వారికి కూడా లేఖలు పంపించడమైనదని, అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన ప్రజలకు, లేఅవుట్ యజమానులకు, లేఅవుట్ నియమాల గురించి వివరణాత్మకంగా తెలియజేయడమైనదని ప్రకటన లో పొందుపరిచారు.

## పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి



**ముత్తుకూరు, జూన్ 20, ప్రభాతవార్త :** పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, 2029లో మరల అధికారం లోకి టిడిపి రావాలని పరిశీలకులు దావా పెంచలరావు వెల్లడించారు. ముత్తుకూరు మండల కేంద్రంలోని షాదీ మంజుల్లో టిడిపి విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా టిడిపి పార్టీ పరిశీలకులు పెంచలయ్యతో పాటు బిల్లు చెంచురామయ్య హాజరయ్యారు. ఈ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడిగా అధికారపుర్వకంగా నీలం మల్లికార్జున యాదవును అలాగే మండల ప్రధాన కార్యదర్శిగా మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డిని ఏకీభవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పెంచలయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు చెప్పిన విధంగా సంక్షేమ పథకాల అమలు చేస్తుందని అన్నారు. తల్లికి వందనం రైతులకు అన్నదాత సుఖీభవ ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో పాటు సూపర్ సిక్స్ పథకాలన్నీ కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అలాగే సర్వేపల్లి నియోజకవర్గం సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెన్నెల కృషి చేస్తున్నారన్నారు. పార్టీ బాలోపేతానికి కార్యకర్తల కీలకమన్నారు. అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా పార్టీ నాయకులు కార్యకర్తలు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈదురు రామ్మోహన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు బులిగర్ల శ్రీనివాసులు, అక్కయ్య గారు ఏడుకొండలు, బిల్లు చెంచురామయ్య, ముత్తుకూరు మండల పరిశీలకులు ఈపూరు మురళీ రెడ్డి సాగునీటి సంఘం అధ్యక్షులు పడాల నరసారెడ్డి పబ్బారెడ్డి గోపాలకృష్ణా రెడ్డి ఆలూరు విష్ణువర్ధన్ రావు కొత్తపల్లి రమేష్ శ ర్మ, మునునూరు రాంమోహన్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ రౌతు సురేఖ, మాజీ ఎంపీపీ నన్నం దీనయ్య, పైనాపురం సర్పంచ్ కావలి విజయ కుమార్, ముత్యం గౌడ్, విక్రమ్ రెడ్డి, రాగాల శివకృష్ణ, మామిడాల శ్రీనివాసులు, దండు శ్రీనివాసులు, వివిధ గ్రామాల టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముత్తుకూరులో రెవెన్యూ డే



**ముత్తుకూరు, జూన్ 20, ప్రభాతవార్త :** ముత్తుకూరు మండల కేంద్రంలో తాసిల్దార్ స్వప్న ఆధ్వర్యంలో రెవిన్యూ డేను గురువారం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ ఉద్యోగులైన మోహన్ రావును, ప్రసాద్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు అంకిత భావంతో పనిచేయాలని అన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో రెవెన్యూ ఉద్యోగుల పాత్ర చాలా కీలకమని, ప్రజలతో మమేకమవుతూ నాణ్యమైన సేవలను పారదర్శకంగా అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, ఆర్ఐ, డిటి, ఆఫీస్ స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు శ్రీధర్‌కు అరుదైన సన్మానం



**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 20, ప్రభాతవార్త :** రెవెన్యూడే సందర్భంగా నాలుగు దశాబ్దాల పాటుగా జర్నలిస్ట్‌గా ఉండి సుదీర్ఘంగా 15 సంవత్సరాల పాటు కలెక్టరేట్ పాత్రికేయులుగా పని చేస్తున్న సీనియర్ జర్నలిస్ట్ వేలమూరి శ్రీధర్‌కి రెవెన్యూ డే సందర్భంగా జిల్లా కలెక్టర్ వారి చేతుల మీదుగా సన్మానించడం జరిగింది.

## తహసిల్దారును సన్మానించిన టిడిపి నాయకులు



**మనుబోలు జూన్ 20 ప్రభాతవార్త :** మనుబోలు నూతన తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన ఈగ రమాదేవిని, అదే విధంగా డిప్యూటీ తహసిల్దారు ప్రదీప్ మరియు ఆర్ఐ అరుణ్ తేజలను శుక్రవారం నాడు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు. ఈకార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పొన్నూరు రామకృష్ణయ్య, చేరెడ్డి కోదండ రామిరెడ్డి, చేరెడ్డి పట్టాభిరామిరెడ్డి, సాని వెంకటరమణయ్య, శివుడు రాజగౌడ్, మోపూరు ధనుంజయరెడ్డి, మణి .బండి కట్టు రవి తదితరులు పాల్గొన్నారు.

## పెత్తనం తట్టుకోలేకే హత్య



**నెల్లూరు క్రైమ్ జూన్ 20 ప్రభాతవార్త :** తమపై పెత్తనం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తుండడంతో తట్టుకోలేక హత్య చేశారు. ఇటీవల నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జైహింద్ సహానీ (40) అనే వ్యక్తిని హత్య చేసిన నిందితులిద్దరిని నవాబుపేట పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరా లను పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నవాబుపేట సీఐ వేణుగోపాల్ రెడ్డి వెల్లడించారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన జైహింద్ సహాని గత కొంతకాలంగా నెల్లూరులోని కిసాన్ నగర్ సమీపంలో ఉన్న శ్రీనివాస్ నగర్‌లో నివాసం ఉంటూ నగరంలో వుడ్ పాలిష్ పనులకు వెళ్తుంటారు. తమ రాష్ట్రానికి చెందిన పరదేశి, రాకేష్ అనే ఇద్దరు యువకులు కూడా జైహింద్ తోపాటే అతని గదిలో ఉంటూ వుడ్ పాలిష్ పనులకు వెళుతూ ఉంటారు. ఈ క్రమంలో ఆ ఇద్దరు యువకులపై జైహింద్ పెత్తనం చాలా ఇస్తూ, మందలిస్తూ ఉండేవాడు. దీంతో జైహింద్ పై కక్ష పెంచుకున్న ఆ ఇద్దరు యువకులు ఈనెల 16వ తేదీ రాత్రి నాపరాయితో జైహింద్ తలపై గట్టిగా మోది హత్య చేశారు. ఈ సంఘటనపై వెంటనే సమాచారం అందుకున్న నవాబుపేట సిఐ వేణుగోపాల్ రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితులిద్దరూ పరాయి రాష్ట్రానికి చెందినవారు కావడంతో తప్పించుకునే అవకాశం ఉండడంతో ఎస్పి జి. కృష్ణ కాంత్ ఆదేశాల మేరకు వారు పారిపోకుండా ఎలాగైనా కేసు చేదించాలనే కృతనిశ్చయంతో ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో శుక్రవారం స్థానిక బర్మా షెల్ గుంట ప్రాంతంలో నిందితులిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. స్వల్ప కాలంలో కేసును చేదించి నిందితులను అదుపులోకి తీసుకున్న సీఐ వేణుగోపాల్ రెడ్డి, ఎస్సై రెహమాన్, స్టేషన్ సిబ్బంది బివి నర్సయ్య, ఎస్ ప్రసాద్, ఆర్ వి రత్నయ్య, ఎం వేణు, జి మస్తానయ్య, షేక్ గౌస్ బాషా లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## రూరల్ ఎమ్మెల్యే ఒక్క డైలాగ్‌తో యాక్షన్‌లోకి దిగిన అధికారులు

**నెల్లూరు రూరల్, జూన్ 20, ప్రభాతవార్త :** నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో శాసనసభ్యులు అభివృద్ధి పనులతో కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి దూసుకు వెళ్తున్నారు. అయితే ఈ నేపథ్యంలో రెండు రోజుల క్రితం రూరల్ ఎమ్మెల్యే చంద్రన్న పార్కు బాట శంకుస్థాపనలో మీడియాతో మాట్లాడుతూ పార్కు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే తాటతీస్తా అంటూ వార్నింగ్ ఇచ్చారు. వార్నింగ్ ఇచ్చిందే తరువుగా నెల్లూరు రూరల్‌లో అధికారుల నిద్రమత్తు వీడి చెలరేగిపోతున్నారు. ఇన్ని రోజులు గుర్తురాని అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములు ఇప్పుడే గుర్తుచేయి. నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని జాతీయ రహదారి సాక్షి ప్రధాన కార్యాలయం పక్కన సర్వేనెంబర్ 295లో అహోబిలం మఠంకి చెందిన రెండు ఎకరాల స్థలం ఉండేదని ఫిర్యాదు అందుకని గురువారం నెల్లూరు జిల్లా మాజీ ఎంపీ 15 కోట్లు విలువ చేసే రెండు ఎకరాల స్థలం కబ్జాకి గురిందని గుర్తించి ఆ స్థలం అహోబిలం మఠం స్థలమని గుర్తించి స్వాధీనం చేసుకుని అహోబిలం మఠం స్థలమని బోర్డు నాటారు. అయితే నెల్లూరు రూరల్ నియోజకవర్గం లోని కొత్తూరు అంబాపురంలో మాజీ మంత్రి లేఔట్ లో ప్రభుత్వ భూమి ఉందంటూ అక్రమంగా ఆక్రమించినట్లు గుర్తించి అధికారులు తెల్లవారుజామున రెండు జెసిపిలతో హడావిడి చేసి లేఅటు గోడలు కొంత భాగం కూల్చేశారు. అయితే ప్రభుత్వ ఆక్రమిత స్థలం డిటిపి అప్రూవల్ లేఔట్ లో ఎలా వచ్చిందో ..? అధికారులు పర్మిషన్ ఎలా ఇచ్చారో..? అర్థం కాని పరిస్థితి. పర్మిషన్ ఇచ్చేటప్పుడు ముడుపుల మత్తులో అధికారులు పరిమిషన్ ఎలా ఇచ్చారో చెప్పాలంటూ స్థానిక ప్రజలు అడుగుతున్నారు. నిజంగానే ప్రభుత్వ ఆక్రమిత భూముల స్వాధీనమా లేక రాజకీయ కక్షతోనే మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేల పై అధికారులు చర్యలు చేపట్టారు అర్థం కావడం లేదని స్థానికులు అనుకుంటున్నారు.

## ఘనంగా సీతారాముల కళ్యాణం



**వరికుంటపాడు, జూన్20, ప్రభాతవార్త:** మండలంలోని గువ్వాడి ఎస్‌సి కాలనీలో సీతారాముల ఉత్స వాలు వైభవంగ ప్రారంభవెనాయి. సీతారాముల ఉత్స వ విగ్రహాలకు వేదపండితుల ఆద్వర్యంలోకళ్యాణ మహోత్స వం మేళతాళాల నడుమ కమనీయంగ సాగింది. గోత్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్ర సాదాలు అందజేశారు. మద్యాహ్నం ఉలస నరసిం హులు రత్నమ్మ దంపతుల ఆద్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. రాత్రికి సీతారాముల గ్రామోత్స వం నిర్వహించారు.

## మండల ఎస్టీ సెల్ అధ్యక్షురాలిగా ఏకసిరి భవాని



**వింజమూరు, జూన్ 20, ప్రభాతవార్త :** వింజమూరు మండల తెలుగుదేశం పార్టీ ఎస్టీ సెల్ మహిళ అధ్యక్షురాలిగా ఎంపీటీసీ సభ్యురాలు ఏకశిరి భవాని జనరల్ సెక్రటరీగా అల్లూరి సుజాత గురువారం సాయంత్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కమిటీ ఎన్నికలలో ఎస్టీ విభాగం నుండి వారి వారి పేర్లు కమిటీ దృష్టికి వచ్చింది కానీ ఎవరు అభ్యంతరం చేయకపోవడంతో వారు ఏకగ్రీవంగా నియమించినట్లు పార్టీ వర్గాలు తెలిపారు. మండల పార్టీ పరిశీలకులు రవిచంద్ర, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో జరిగిన కమిటీ ఎన్నికలలో ఏకగ్రీవం జరిగిన వారి పేర్లు పార్టీ అధిష్టానంకు పంపించి తది జాబితాను త్వరలో ప్రకటించనున్నట్లు వారు తెలిపారు.

## వింజమూరును ఆదర్శంగా అందంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



**వింజమూరు, జూన్ 20, ప్రభాతవార్త :** వింజమూరు మేజర్ పంచాయతీను ఆదర్శంగా అందంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తానని వింజమూరు మేజర్ పంచాయతీ కార్యదర్శిగా శుక్రవారం బాధ్యతలను స్వీకరించిన కొప్పోలు రామారావు పేర్కొన్నారు. ఈయన సింగరాయకొండ మూలగుంటపాడు పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తూ వింజమూరు పంచాయతీకి బదిలీపై వచ్చారు. ముందుగా కార్యదర్శి రామారావు ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డిని సర్పంచ్ నల్లగొండ సృజనను కలిసి అనంతరం ఈవోపీఆర్డీ పంచాయతీ ఇన్‌ఛార్జీ కార్యదర్శి గోపి శ్రీనివాస్ వద్ద నుండి కార్యదర్శి బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో పారిశుధ్యం తాగునీటి సరఫరా విద్యుత్ లైట్లు ఏర్పాటుతో పాటు ఇంటి పన్నులు, కుళాయి పన్నులు సకాలంలో వసూళ్ల చేసి పంచాయతీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రతి ఒక్కరు స్వచ్ఛ వింజమూరుకు సహకరించాలని కోరారు. తాను ఇక్కడ గతంలో 2015 నుండి 2019 వరకు పని చేసిన అనుభవం ఉందని, పంచాయతీని అభివృద్ధి చేసుకునేందుకు ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ పంచాయతీ పాలకవర్గంతో కలిసి పని చేయడం జరుగుతుందన్నారు. పారిశుధ్యం మెరుగునకు మురుగు కాలువలు పూడికతీతలు తీసి ప్రజలు చెత్తాచెదారాలను మురుగు కాలువల్లో వేయకుండా చూడడం జరుగుతుందన్నారు. అలాగే చెత్త నుండి సంపద కేంద్రంకు పట్టణంలో వచ్చిన వ్యర్థ పదార్థాలను తరలించి సంపద సృష్టించే విధంగా చర్యలు చేపడతామన్నారు. పంచాయతీ ప్రజలు చెల్లించాల్సిన ఆస్తిపన్నులను నీటి కొళాయి పన్నులను సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన రామారావును శాలువాతో పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సృజన, ఈవోపీఆర్డీ గోపి శ్రీనివాస్, రికార్డు అసిస్టెంట్ శ్రీనివాసులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రామయ్య విగ్రహాన్ని కందుకూరులో ప్రతిష్టించండి



**వలేటివారిపాలెం జూన్ 20 ప్రభాతవార్త :** కందుకూరు పట్టణంలోని ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజి వ్యవస్థాపకులు, ప్రముఖ విద్యావేత్త, మాజీ జర్నలిస్టు కంచర్ల రామయ్య అలియాస్ ఈనాడు రామయ్య మృతి బాధాకరమని బీజేపీ ఓబీసీ మోర్చ రజక విభాగం రాష్ట్ర కన్వీనర్ వింజమూరు మస్తాన్‌బాబు అన్నారు. మండలంలోని కుగ్రామమైన అత్తంటివారిపాలెంలో జన్మించి జర్నలిస్టుగా జీవితం ప్రారంభించి, విద్యావేత్తగా జీవితంలో స్థిరపడ్డారని అన్నారు. వేలాదిమంది యువతకు ఉన్నతవిద్యను ప్రసాదించి ఈ ప్రాంత ప్రజల్లో సుస్థిర స్థానం సంపాయించుకున్నారని ఆయన అన్నారు. బడుగుబలహీనవర్గాల అభ్యున్నతిని కాంక్షించే రామయ్యవిగ్రహాన్ని కందుకూరులో ప్రతిష్టించాలని సూచించారు. కుమారుడు శ్రీకాంత్‌నురాష్ట్ర శాసనమ ండలిలో తూర్పురాయలసీమ పట్టభద్రుల నియోజకవర్గ సభ్యులుగా తీర్చదిద్దిన ఘనత ఆయనకే దక్కుతు ందన్నారు. ఈ మేరకు శుకృవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## నేటి నుండి పాలిటెక్నిక్ ప్రవేశాల ప్రారంభం



**కావలిరూరల్, జూన్20 ప్రభాతవార్త :** పాలిటెక్నిక్ ప్రవేశాలకు సంబంధించి 2025-26 విద్యాసంవత్సరానికిగాను షెడ్యూల్‌ను విడుదల చేయడం జరిగిందని కావలి, రుద్రకోట గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సుశీల్‌కుమార్‌ప్రియ శుక్రవారం తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయన వివరాలను తెలియచేస్తూ జూన్ 21వ తేది శనివారం నుండి జూన్ 28వ తేది శనివారం వరకు 8 రోజులపాటు ధృవపత్రాల పరిశీలనను చేపట్టనున్నట్లు తెలియచేశారు. విద్యార్థులు కౌన్సిలింగ్‌కొరకు ఆన్‌లైన్‌లో ఒ.సి, బి.సి 700 రూపాయలు, ఎస్సీ, ఎస్టీ 250 రూపాయలు చెల్లించాలని తెలియచేశారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఆన్‌లైన్‌కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు క్రింద తెలుపబడిన ధృవపత్రాలను ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తోపాటు రెండు సెట్లు జెరాక్స్‌కాపీలను కూడా వెంట తెచ్చుకోవాలని తెలియచేశారు. ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన రశీదు, పాలిసెట్ 2025 హాల్‌టికెట్, పాలిసెట్ 2025 ర్యాంకుకార్డు, ఎస్ఎస్‌సి మార్కులిస్ట్, 4వ తరగతి నుండి 10వ తరగతివరకు స్టడీ సర్టిఫికెట్స్, బదిలీ ధృవపత్రం, ఈడబ్ల్యుఎస్ సర్టిఫికెట్ ఫర్ ఓ.సి క్యాండియేట్స్, ఆదాయ ధృవీకరణ పత్రం, కుల ధృవీకరణపత్రం తీసుకురావాలని తెలియచేశారు. పాలిటెక్నికల్ కళాశాల ప్రవేశాల కొరకు జరుగు ఆన్‌లైన్ వెబ్‌కౌన్సిలింగ్‌ను కావలి, రుద్రకోట గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశానందు పైన తెలుపబడిన తేదీలలో జరుపబడునని తెలియచేశారు. ఈ సదుపాయాన్ని పరిసరప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిగిలిన వివరాల కొరకు 9912983434, 9490079526 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

## బోగోలులో రెవెన్యూ డే



**బిట్రగుంట జూన్ 20 ప్రభాతవార్త:** బోగోలు తహసిల్దార్ కార్యాలయము నందు శుక్రవారం రెవిన్యూ డే ను ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో రెవిన్యూ వ్యవస్థ ఔన త్యాన్ని వివరిస్తూ మరియు రెవిన్యూ శాఖ ద్వారా ప్రజలకు అందే వివిధ రకాల సేవలు గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు రెవెన్యూ శాఖలో సేవలందించి పదవి విరమణ చేసిన గ్రామ రెవెన్యూ అధికారి తిరగాబతిన మాల్యాద్రిని సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తహసిల్దారు సానా శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా జిల్లా సర్వే అధికారి వై. నాగశేఖర్, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే కావలి, ఆర్. శ్రీనివాస రావు, డిప్యూటీ తహసిల్దార్ భరత్ మరియు కార్యాలపు సిబ్బంది గ్రామ రెవెన్యూ అధికారులు సర్వే శాఖ వారు మరియు గ్రామ రెవెన్యూ సహాయకులు పాల్గొనడం జరిగినది.

## బదిలీ అయిన వ్యవసాయశాఖ అధికారిణికి సన్మానం



**బిట్రగుంట, జూన్ 20, ప్రభాతవార్త:** బోగోలు మండలంలో ఇటీవల జరిగిన సాధారణ బదిలీలలో మండల వ్యవసాయ శాఖ అధికారిగా పనిచేస్తున్న విజయలక్ష్మి వ్యవసాయ విస్తరణ అధికారి వి. అశోక్ లను మండల వ్యవసాయ శాఖ సిబ్బంది మరియు గ్రామ వ్యవసాయ శాఖ సచివాలయ కార్యదర్శి ఘనంగా సన్మానించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వీరిని సన్మానిస్తూ వీరు అందించిన సేవల్ని ప్రశంసించారు.

## భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**బిట్రగుంట జూన్ 20 ప్రభాత వార్త:** భవన నిర్మాణ కార్మికుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి తుమ్మల. వెంకయ్య డిమాండ్ చేశారు. మండల సిపిఎం కార్యాలయం లో శుక్రవారం భవన నిర్మాణ కార్మికుల సమస్యల పైన సీఐటీయూ రూపొందించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసినవైఖరి ఆవలంబిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు వారికి అందడంలేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధి నుండి ఈ పథకాలు అందేలా చూడాలన్నారు. ఈనెల 22 వ తేది న మండల భవన నిర్మాణ కార్మికుల మహాసభ నిర్వహించడం జరుగుతుంది అని ఈ సమావేశంలో పలు అంశాలు చర్చించనున్నట్లు కావున జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమం లో మండల సిఐటియు సెక్రటరీ సి నరహరి, మండలం భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రెసిడెంట్ తుమ్మల సీనయ్య, సిఐటియు వైస్ ప్రెసిడెంట్ ఎస్ కే బాదుల్లా, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జిలాని, విజయ్ కుమార్, సిఐటియు ఉపాధ్యక్షుడు ఎస్.కె అన్వర్ భాష, సీనియర్ పొట్లూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యతా ప్రమాణాలు భేష్



**కోవూరు, జూన్20 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం జరుగుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పర్వీన్, మండల టీడీపీ అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ పాఠశాలలోని ఏజెన్సీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడమే కాకుండా ప్రభుత్వం విడుదల చేసిన మెనూలో లేని కూరలు కూడా పెడుతున్నారని, ఇందుకు ఏజెన్సీ వారిని ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఇదే స్ఫూర్తిని నిరంతరం కొనసాగించాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సోఫియా కిరణ్మయి, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, కూటమి నేతలు బెల్లంకొండ విజయకుమార్, సాయిరెడ్డి, నాటకరాణి వెంకట్, బాల రవి, ఎం. సుధాకర్, పోలిశెట్టి సుబ్బారావు, గాదిరాజు అశోక్‌కుమార్, తదితరులు ఉన్నారు.

## ప్రజలందరికి అందుబాటులో సేవా లక్ష్యంగా రెవిన్యూశాఖ



**మనుబోలు జూన్ 20 ప్రభాతవార్త :** మండల కేంద్రమైన మనుబోలు తహసిల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం నాడు రెవిన్యూ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటి తహసిల్దారు ప్రదీప్ మాట్లాడుతు రాష్ట్ర వ్యాప్తంగా రెవిన్యూ అసోసియేషన్ అధ్యక్షులు ఆదేశాల మేరకు ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తు న్నామని ఇందులో భాగంగా మనుబోలు రెవిన్యూ కార్యాలయంలో తాము ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి సేవలు అందిస్తున్నాం అనే దానిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా రెవిన్యూ డే నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల అందరికి అందుబాటులో ఉండి సేవ చేయడమే లక్ష్యంగా రెవిన్యూ శాఖ ముందుకు సాగడం జరుగుతుందని తెలిపారు. ముందుగా అధికారుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దారు రమాదేవి ఆర్ఐ విఆర్ఒలు ,సర్వేయర్లు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## 22న మండల రజక సంఘ సమావేశం

**వరికుంటపాడు, జూన్20, ప్రభాతవార్త:** 22 ఆదివారంనాడు సాయంత్రం 3గంటలకు వరికుంటపాడు మండల రజకసంఘ సమావేశం వరికుంటపాడునందు జరుగుతుందని ఆసంఘం నాయకులు కంచర్ల వెంకటేశ్వర్లు, యాదగిరి తిరుపాలు, చిలకపాటి సుబ్బారావు, మాచర్ల గురవయ్యలు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈసమావేశంలో మండల రజక నూతన కమిటి ఎన్నిక జరుగుతుందని కాబట్టి మండలంలోని రజక సోదరులందరు తప్పనిసరిగ హాజరు కావాలని వారు కోరారు.

## సాధారణంగా సాగిన సర్వసభ్య సమావేశం

## గైరు హజరైన విద్యుత్ శాఖ అధికారులు




**మనుబోలు జూన్ 20 ప్రభాతవార్త :** మండలకేంద్రమైన మనుబోలు ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఎంపిపి గుండాల వజ్రమ్మ అద్యక్షతన సర్వసభ్య సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి వజ్రమ్మ మాట్లాడుతు వైద్య, ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులు అందుబాటులో ఉండి ప్రజలకు సేవలు అందించాలని తెలిపారు. ముఖ్యంగా వైద్యులు తమ బాధ్యతను విస్మరించకుండా ఉండాలని కోరారు. అదే విధంగా ఎండా కాలంలో మంచి నీటి సౌకర్యంలో ఎలాంటి లోటు పాట్లు లేకుండా చూసుకోవాలని తెలియజేశారు. సమస్యలు అధికంగా ఉన్న విద్యుత్ శాఖ మరియు ఇరిగేషన్‌శాఖ అధికారులు హాజరుకాకపోవడం పట్ల విచారం వ్యక్తం చేశారు. తహసిల్దారు రమాదేవి మాట్లాడుతు ప్రజలకు అందుబాటులో ఉండి రెవిన్యూ పరమైన సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామన్నారు. బిసి కాలనీ శ్మశాన వాటిక స్థలం సర్వే చేసి త్వరితగతిన సమస్యను పరిష్కరిస్తామన్నారు. అనంతరం వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య మాట్లాడుతు మరో రెండు రోజులలో అన్నదాత సుఖీభవ పథకం రైతుల ఖాతాల్లో జమ కానుందని తెలిపారు. మండలంలో 33 మందికి తప్ప మిగతా వారందరికి ఈ కెవైసి పూర్తయిందని తెలిపారు. అన్నదాత సుఖీభవ రాని వారికి తదుపరి అప్‌డేట్ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. అనంతరం విద్యాశాఖ వారు మాట్లాడుతు సమస్యరు రిపోర్టు రూపంలో ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందని అన్నారు. మిగిలన శాఖల వారు సాధారణంగా వారి వారి బాద్యత పురోగతిని సమస్యలను వివరించారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఒ జలజాక్షి మండల ప్రజాపరిషత్ ఉపాధ్యాక్షులు తిక్కవరపు వెంకటరమణారెడ్డి తహసిల్దారు రమాదేవి సర్పంచులు పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## తలసేమియా బాధిత చిన్నారులకు రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం



**కావలిరూరల్, జూన్20 ప్రభాతవార్త :** తలసేమియా బాధిత చిన్నారులకు రెడ్‌క్రాస్ అందిస్తున్న సేవలు అపూర్వమని కావలి పట్టణ తెలుగుదేశంపార్టీ అద్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు తెలియచేశారు. కావలి రెడ్‌క్రాస్ తలసేమియా డేకేర్ సెంటర్‌ను శుక్రవారం గుత్తికొండ కిషోర్‌బాబు సందర్శించి అక్కడ రక్తం ఎక్కించుకుంటున్న తలసేమియ బాధిత చిన్నారులను, వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన తలసేమియా కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ పామూరు శ్రీధర్, డాక్టర్ టి.రమ్యలతో సమావేశమై కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న సేవలను గురించి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తలసేమియా, సికిల్‌సెల్, హిమోఫీలియా బాధితులకు వ్యాధినిర్ధారణ పరీక్షలు, రక్తమార్పిడి, మందులు, పౌష్టికాహారం దాతల సహకారంతో ఉచితంగా అందించడం అభినందనీయమని తెలిపారు. ఈ మహోన్నత సేవాకార్యక్రమానికి తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి చేతులమీదుగా ప్రారంభించిన ఈ కేంద్రం సేవలు విస్తృతమౌతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రక్తమార్పిడి చేయించుకున్న చిన్నారులకు మందులు, పౌష్టికాహారం అందచేయడం జరిగింది.

**-తలసేమియా ఆసుపత్రి నిర్వహణకు విరాళం అందించిన ఎడిఈ...**

విశ్రాంత విద్యుత్‌శాఖ ఎడిఈ ఎం.మదుసూధన్‌రావు తలసేమియా డేకేర్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులకు మందులు, పౌష్టికాహార వితరణకు పదివేల రూపాయలు విరాళాన్ని వైద్యాధికారి డాక్టర్ పామూరి శ్రీధర్‌కు అందచేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ ఛైర్మన్ దాకారపు రవిప్రకాష్, కోశాధికారి ఆరికట్ల మధుసూధన్‌రావు, కార్యదర్శి బియస్ ప్రసాద్, ఆర్థిక కమిటి సభ్యులు పి.కొండలరావు, తలసేమియా కమిటి సభ్యులు కల్లయ్య, సిబ్బంది శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా పరిషత్ బాలుర పాఠశాలనందు సక్షమ్ స్థాపన దినోత్సవం



**కావలిరూరల్, జూన్20 ప్రభాతవార్త :** కావలి తుమ్మలపెంట రోడ్డులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నందు సక్షమ్ స్థాపన దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా న్యాయవాది ఐ.సాయిప్రసాద్ పాల్గొని మాట్లాడారు. ఈ సంస్థ 2008 జూన్ 20వ తేదీన నాగ్‌పూర్‌లో నూతనంగా స్థాపించబడి ందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరి ంచుకుని సక్షమ్ సంస్థ దేశవ్యాప్తంగా దివ్యాంగులకు ఎన్నో సహాయసహకారాలు అందించడం జరిగిందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసి చిరం జీవి, సక్షమ్ కార్యకర్తలు పి.నాగమణి, ఎం.వేణుగోపాల్‌రావు, జిటి.తిరుపతిస్వామి, అమరావతి, సుబ్బారావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## కంచర్ల రామయ్యకు నివాళులర్పించిన కంచర్ల మురళి




**కావలిరూరల్, జూన్20 ప్రభాతవార్త** ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల అధినేత, విద్యావేత్త ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తండ్రి కంచర్ల రామయ్య భౌతికకాయాన్ని శుక్రవారం భారతీయ జనతాపార్టీ కిసా న్మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచర్ల ముర ళికృష్ణ నాయుడు కందుకూరులోని ఆయన నివా సంనందు సందర్శించి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించడంజరిగింది. అనంతరం ఆయన మాట్లాడారు. అక్షరమే ఆయుధంగా నిబద్ధతతో ఒక దినపత్రికలో జర్నలిస్ట్‌గా వివిధ హో దాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ అనంతరం విద్యతోనే సమాజం అభివృద్ధి అని భావించారు. కందుకూరు పట్టణంలో ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలను స్థాపించి ఎంతో మంది విద్యార్థులకు విద్యాబోధను అందచేసిన మహనీయుడు కంచర్ల రామయ్య అని తెలిపారు. తన తనయుడు తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయం సాధించడంలో చేసిన కృషి ఎనలేనిదని తెలియచేశారు. రామయ్య సాధించలేనిది తన కుమారుడు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ సాధించాడని, ఆయన కలలను శ్రీకాంత్ విజయవంతంగా ముందుకు తీసుకుపోతున్నాడని పలు సందర్భాల్లో చెప్పడం జరిగిందని తెలియచేశారు. వీరి మరణం వారి కుటుం బానికి, మాకు తీరనిలోటు అని తెలియచేశారు. ఆ మహనీయుని పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నామన్నారు.

## కావలి ఏరియా వైద్యశాలలో విజిలెన్స్ తనిఖీలు



**కావలిరూరల్, జూన్20 ప్రభా తవార్త** కావలి ఏరియా వైద్యశాలలో విజిలెన్స్ తనిఖీలు కల కలం రేపాయి. వైద్యశాలకు వైద్యులు సక్రమంగా రాకపోవడం, ఆరోగ్యశ్రీ నిధులు దుర్విని యోగం, తదితర అంశాలపై ప్రభుత్వానికి అందిన ఫిర్యాదుల మేరకు వైద్యశాఖ విజిలెన్స్ అధికారి డాక్టర్ బిసికె.నాయక్ ఆధ్వర్యంలో ఆసుపత్రి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులతో మాట్లాడివారికి అందిస్తున్న వైద్య సేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీలలో మీడియాను కూడా అనుమతించలేదు. వైద్యులను, నర్సులను, వైద్యసిబ్బందిని వేరువేరుగా లోపలికి పిలిచి వారి స్టేట్‌మెంట్లను రికార్డు చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ అధికారి నాయక్ మా ట్లాడారు. తాము సేకరించిన వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. వీరితోపాటు డాక్టర్ ఎం.మజీద్‌బీ, డాక్టర్ వై.సురేష్‌చంద్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కె.భార్గవ్, సెక్షన్ ఆఫీసర్ రంగనాయకులు పాల్గొన్నారు.

## మన్నవ రవిచంద్రను సత్కరించిన ఎమ్మెల్యే



**కావలిరూరల్, జూన్20 ప్రభాతవార్త** ఉదయగిరి నియోజకవర్గం వింజమూరు మండల కమిటి పరిశీల కుడు, తెలుగుదేశంపార్టీ నెల్లూరు పార్లమెంట్ ఉపా ధ్యక్షులు,సీనియర్ టిడిపి నాయ కులు మన్నవ రవిచంద్రను వింజమూరులో జరిగిన గ్రామ, మండల కమిటి నియామకాలకు సంబంధించిన సమావేశంలో ఉదయగిరి శాసన సభ్యులు కాకర్లసురేష్ ఆయనను పూలబొకే అందచేసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించడం జరిగింది. అనంతరం మన్నవ రవిచంద్ర ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు పూలబొకే అందచేసి దుశ్శాలువాలతో ఘ నంగా సత్కరించడం జరిగింది. అనంతరం మన్నవ రవిచంద్ర మాట్లాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబా బునాయుడు, యువనాయకులు నారా లోకేష్‌ల సారథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమపథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని తెలియచేశారు. ఉదయగిరి నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో అందరూ కలిసికట్టుగా పనిచేసి ఉదయగిరి నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

## సీతయ్యను పరామర్శించిన నల్లపరెడ్డి



**బుచ్చి జూన్ 20 ప్రభాతవార్త** నగర పంచాయితీలోని వైసిపి సీనియర్ నేత బుచ్చిరూరల్ బ్యాంకు మాజీ ఛైర్మన్ మేనకూరు సీతారామిరెడ్డిని ఆయన నివాసంలోకి కలిసి వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, వైసిపి రాష్ట్ర పిఎసి సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆయ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొన్నారు. కొద్దిసేపు ఆయ నతో ప్రస్తుత రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. ఈకార్యక్రమంలో ఆయన వెంట వైసిపి నాయకులు వీరిచలపతిరావు, షేక్.షాహుల్, చెర్లో సతీష్‌రెడ్డి, డాక్టర్ అల్లాబక్షు, కౌన్సిలర్, బుచ్చి నగర మహిళా అధ్యక్షురాలు షేక్.షకిలా బేగం, నియోజకర్గం మహిళా అధ్యక్షురాలు మోర్ల జయంతి, మోర్ల భరత్, బాల శంకర్‌రెడ్డి, కోడూరు మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్ కంఠా అనంతమ్మ, బిట్రగుంట ప్రమీలమ్మ , కోవూరు నా యకులు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, మావూలూరు శ్రీనివాసులురెడ్డి, కౌన్సిలర్ యానాదిరెడ్డి, పలువురు వైసి పి నాయకులు, కార్యకర్తలున్నారు.

## రెవెన్యూ డే సందర్భంగా సన్మానాలు



**కోవూరు, జూన్20 ప్రభాతవార్త :** మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం రెవెన్యూ డే సందర్భాన్ని పురస్కరించుకుని పదవీ విరమణ చేసిన తహ సీల్దార్ సురేంద్ర , తదితరులను రెవెన్యూ శాఖ ద్వారా శాలువా, పూలమాలతో ఘనంగా సత్కరించి సన్మానంచేశారు. అదేవిధంగా డిప్యూటీ తహసీల్దార్ గ్రామ రెవెన్యూ అధికారి, వీఆర్‌ఏ అశోక్‌లను కూడా శాలువా, పూలమాలతో సత్కరించారు. టీడీపీ సీనియర్ నా యకులు ఇంతా మల్లారెడ్డి, గాదిరాజు అశోక్‌కుమార్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## ప్రసన్నను అభినందించిన గంగవరం సర్పంచ్



కోవూరు, జూన్20 ప్రభాతవార్త :వైసీపీ రాష్ట్ర అంగన్‌వాడీ వింగ్ ప్రధాన కార్యదర్శిగా నియమింపబడిన గంగవరం సర్పంచ్ వై. లక్ష్మీకుమారి.. మాజీ మంత్రి , వైసీపీ రాష్ట్ర పీఏసీ సభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన వైసీపీ పార్టీకి, మాజీ మంత్రి ప్రసన్నకుమార్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, మండల వైసీపీ అధ్యక్షుడు అత్తిపల్లి అనూప్‌రెడ్డి, వైసీపీ పట్టణ అధ్యక్షుడు , వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైసీపీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శి నలుబోలు సుబ్బారెడ్డి, పడుగుపాడు సొసైటీ మాజీ ఛైర్మన్ రామిరెడ్డి మల్లికార్జున్‌రెడ్డి, ఎస్‌టీ సెల్ అధ్యక్షుడు కవరగిరి ప్రసాద్, గంగవరం ఉప సర్పంచ్ గోడా మోషే, తదితరులు ఉన్నారు.

## రోట్టెల పండుగకు ఆర్టీసీ అదనపు బస్సులు

### నడపాలంటూ వినతి



**నెల్లూరు, జూన్20 ప్రభాతవార్త-విద్య** జులై 6 నుండి జరుగనున్న రాష్ట్ర పండుగ రొట్టెల పండుగ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ సంస్థ రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుండి నెల్లూరుకు ప్రత్యేక అదనపు బస్సులను నడపాలని అంతర్జాతీయ మానవహక్కుల కమిషన్ రాష్ట్ర చీఫ్ జనరల్ సెక్రటరీ, మదీనా వాచ్స్ , గ్రూప్స్ ఛైర్మన్ షేక్. ఇమ్తియాజ్ కోరారు. ఈ మేరకు వినతి పత్రాన్ని శుక్రవారం నగరంలోని స్థానిక ఆర్టీసీ ప్రధాన బస్టాండులోని ఆర్ఎం కార్యాలయంలో ఆర్ఎంకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్రంలోని అన్నీ ప్రాంతాల నుండి నగరానికి భక్తులు వచ్చేందుకు, వెల్లేందుకు బస్సులను ఏర్పాటుచేయ్యాలన్నారు. అలాగే విజిటర్స్ కోసం నామినీ ఫీజులను వసూల్లు చేయ్యాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిటిఎం షమీమ్, విజిలెన్స్ ఆర్టీసీ డిఎస్పీ, తదితరులు పాల్గొన్నారు.

## పూర్తయిన యోగాంధ్ర ఏర్పాట్లు



**కోవూరు, జూన్20 ప్రభాతవార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో శనివారం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న యోగాంధ్రకు సంబంధించిన శుక్రవారం జరుగుతున్న ఏర్పాట్లను పార్టీ సీనియర్ నాయకులు పరిశీలన చేపట్టారు. శనివారం ఉదయం 7 గంటలకు ఈ యోగాంధ్ర కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందని దీనిని పూర్తి స్థాయిలో విజయవంతం చేసేలా ప్రతి ఒక్కరూ తగు చొరవ తీసుకోవాలని నేతలు సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కోదూరు కమలాకర్‌రెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, బెజవద వంశీకృష్ణారెడ్డి, , మండల పార్టీ అధ్యక్షుడు కొల్లారెడ్డి సుధాకర్‌రెడ్డి, నేతలు ఇంతా మల్లారెడ్డి, సాయిరెడ్డి, అశోక్‌కుమార్, బాల రవి, ఎం. సుధాకర్‌శ్రీనివాసులు,, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, నాటక రాణి వెంకట్, తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య, ఎంపీడీవో శ్రీహరిరెడ్డి, మండల విద్యాశాఖ అధికారి రహీమ్, తదితరులు ఉన్నారు.

## మౌంట్‌లిట్రా స్కూల్ కరస్పాండెంట్ ధనరాజ్

### తల్లి ఉత్తర క్రియలకు హాజరైన వీబీఆర్



**నెల్లూరు, జూన్ 20, ప్రభాతవార్త-వైద్యం** మౌంట్ లిట్రా స్కూల్ కరస్పాండెంట్ ధనరాజు మాతృమూర్తి లక్ష్మమ్మ ఇటీవల అనారోగ్య కారణాలతో కాలం చేయడంతో శుక్రవారం జరిగిన ఉత్తర క్రియలకు వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి హాజరయ్యారు. లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీబీఆర్ మాట్లాడుతూ తల్లిలేని లోటు తీర్చలేనిదని వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆయన ఆకాంక్షించారు. ఆయనతో పాటు కార్పొరేటర్లు వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, దామవరపు రాజశేఖర్, అలువులు టీడీపీ ముఖ్య నాయకులు ఉన్నారు.

## టెర్రస్ పైనుంచి జారిపడి బాలిక మృతి

### విషాదంలో లేగుంటపాడు గ్రామం



**కోవూరు జూన్ 20 ప్రభాతవార్త** టెర్రస్ పైనుంచి ఆడుకుంటూ ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడిన ఓ బాలిక మృతి చెందిన సంఘటన లే గుంటపాడు గ్రామంలో గురువారం సాయంత్రంచో టు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు కోవూరు మండలం లేగుంటపాడు గ్రామానికి చెందిన దం పతులకు ఇరువురు పిల్లలు ఉన్నారు వీరిలో కుమార్తె రేష్మ గురువారం సాయంత్రం టెర్రస్ మీద ఆడు కుంటూ ప్రమాద వసాతుకిందకు పడి చాకు తలల గుచ్చుకుంది ఈ మేరకు బాలికను వెంటనే నెల్లూరుకు ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రాథమిక చికిత్స చేయించి మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు అక్కడ నుంచి కూడా చెన్నైకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది దీంతో లేగుంటపాడు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి ఆడుకుంటున్న బాలిక అకస్మాత్తుగా మృతించడంతో తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు కూడా తీవ్ర ఆవేదనలో మునిగిపోయారు. బాలిక మృతి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంగనాథ్ గౌడ్ తెలిపారు

## బిజెపిలో పెద్దఎత్తున చేరికలు మండల కార్యవర్గ సమావేశం





**బుచ్చి జూన్ 20 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండల భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో రూరల్ మండలాధ్యక్షులు సిద్దన. మనోహర్‌రెడ్డి అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మండల ఇంచార్జి పగడాల మురళీకృష్ణ ముఖ్య అతిధిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా సిద్దన మనోహర్‌రెడ్డి మండలంలోని పార్టీ నాయకులు కార్యకర్తల చేత వికసిత్ భారత్ 2047 ప్రతిజ్ఞ చేయిం చారు. అనంతరం బుచ్చిరెడ్డిపాళెం రూరల్ మండల పరిధిలోని దామరమడుగు, ఇస్కపాళెం పంచాయితీల నుండి భారీగా పార్టీలో చేరడం జరిగింది. పార్టీలో చేరిన వారిని పార్టీ మండల అధ్యక్షులు పలువురు సీని యర్‌నాయకులు పార్టీ కండువాలు కప్పి పార్టీలోనికి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా మన ప్రియ తమ ప్రధాని నరేంద్రమోడీ 11 సంవత్సరాల సుపరిపాలన గురించి పలువురు వక్తలు ప్రసంగించడం జరిగింది. అనంతరం వికసిత్ భారత్ 2047 కరపత్రాలను ఆవిష్కరించి కార్యకర్తలకు అందచేయడం జరిగిం ది. తదుపరి పార్టీ కార్యాలయం ఎదుట మొక్కలు నాటడం జరిగింది. అనంతరం బుచ్చిరెడ్డిపాళెం రూరల్ మండలంలోని ఇస్కపాళెం పంచాయితీ వడ్డిపాళెం గ్రామంలో 47,48 పోలింగ్ బూత్‌లలో 11 సంవత్సరాల సుపరిపాలన కరపత్రాలు ఇంటింటికి పంపిణీ చేయడం జరిగింది. అనంతరం వడ్డిపాళెంలో మొక్కలు నాటే కార్యక్రమం చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో బిజెపి మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ పి.రాఘవరెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డాక్టర్.జి.వి కృష్ణారెడ్డి, మండల పూర్వ ద్యక్షులు గండి రఘురామయ్య, మైనార్టీ మోర్చ జిల్లా అధ్యక్షులు షేక్.ఖాదర్‌బాషా, జిల్లా అధికార ప్రతినిధి గంజం పెంచల ప్రసాద్, జిల్లా కార్యవర్గసభ్యులు వన్నెపంట బాల రాఘవరెడ్డి, ఓబిసి జిల్లా కార్యదర్శి మహిమలూరు సతీష్, మండల ప్రధాన కార్యదర్శులు పెజ్జాయి కృష్ణారెడ్డి, అల్లం.మస్తానయ్య, ఉపాధ్యక్షులు మోడెం నిరంజన్‌రెడ్డి, ఫైడాల వెంకటేశ్వరెడ్డి, చీమల వెంకటరమణయ్య, కిసాన్ మోర్చ మండల అధ్యక్షులు నెల్లూరు సుబ్రహ్మణ్యం, యువమోర్చ మండల అధ్యక్షులు కాకు మధుసూదన్, దళిత మోర్చ మండల అధ్యక్షులు కట్టా ఏడుకొండలు, గిరిజన మోర్చ మండల అధ్యక్షులు రాగి ప్రసాద్, ఓబిసి మోర్చ మండల అధ్యక్షులు గండి సుబ్రహ్మణ్యం, మైనార్టీ మోర్చ మండల అధ్యక్షులు సయ్యద్ చాన్‌బాషా, చేనేత సెల్ మండల అధ్యక్షులు వంకా యువ కుమార్, గండి పెంచలయ్య, బిజెపినాయకులు, కార్యకర్తలు, కొత్తగా పార్టీలో చేరిన వారు పాల్గొన్నారు.

## డికే లో ముందస్తు యోగా డే వేడుకలు



**నెల్లూరు, జూన్20 ప్రభాతవార్త- విద్య** శుక్రవారం నగరంలోని స్థానిక డికే మహిళా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రమణారెడ్డి ఆధ్వర్యంలో ముందస్తు యోగా వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతి థులుగా డికే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరి, ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి డాక్టర్ టి.వరప్రసాద్, డివిఈఓ మధుబాబులు పాల్గొని మాట్లాడారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమౌతుందని, చిన్నతనం నుండే అందరూ యోగా, క్రీడలు వంటి వాటిలో పాల్గొనాలన్నారు. క్రమం తప్పకుండా యోగా చేస్తే అనేక శారీరక రుగ్మతులు దూరం అవుతాయని తెలిపారు. పతాంజలి యోగ యువభారత్ జిల్లా ఇన్‌చార్జ్ కోటేశ్వర్‌రెడ్డి కళాశాలలోని విద్యార్థినిలచే యోగాసనాలకు చేయించారు. అనంతరం కళాశాల కెమిస్ట్రీ లెక్చరర్ కొండయ్య వితరనతో జూనియర్ ఇంటర్ ఫలితాల్లో కెమిస్ట్రీ విభాగంలో 60కి 60 మార్కులు సాధించిన మైధిలి, రమణమ్మలకు ఒక్కొక్కరికి రూ.10వేల నగదును బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.ప్రసన్న, భారతి, శివయ్య, అధ్యాపకులు , అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## రెవిన్యూ డే సందర్బంగా తహసిల్దారుకు సన్మానం



**కోవూరు జూన్ 20 ప్రభాతవార్త** కోవూరు లోని తహసిల్దారు కార్యాలయంలో శుక్రవారం రెవిన్యూ డే సందర్భాన్ని పురస్కరించుకొని తహసిల్దారు సిహెచ్ సుబ్బయ్యను రెవెన్యూ అధికారులు ఉద్యోగులు శాలువా బొక్కేతో ఘసంగా సన్మానిం చారు. ఈకార్యక్రమంలో డిప్యూటి తహసిల్దారు బషీర్,రీ సర్వే డిప్యూటి తహసిల్దారు మధుసూదన్‌రావు, ఎలక్షన్ డిప్యూటి తహసిల్దారు సురేష్,ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ రమణయ్య,సీనియర్ అసిస్టెంట్ శ్రీనాద్ రెవిన్యూ ఇనస్పెక్టర్ తదితరులు పాల్గోన్నారు.

## ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత వేగంవంతం..

### - జులై 11, 12, 13 తేదీల్లో రెవెన్యూ స్పోర్ట్స్: కలెక్టర్ ఓ ఆనంద్




**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 19, ప్రభాతవార్త** ప్రజలకు మెరుగైన సేవలందించి రెవెన్యూ వ్యవస్థ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ రెవెన్యూ ఉద్యోగులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెవెన్యూ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ దశాబ్దాలుగా ప్రజలతో నేరుగా సత్సంబంధాలు కలిగిన ఏకైక శాఖ రెవెన్యూ శాఖ అని, ఉద్యోగులందరూ బాధ్యతగా పనిచేసి రెవెన్యూ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. రెవెన్యూశాఖలో వస్తున్న ఆధునిక టెక్నాలజీని విని యోగించుకుని ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత వేగంగా అందించేయాలని సూచించారు. రెవెన్యూ అసోసియేషన్‌కు ఒక గెస్ట్‌హౌస్‌ను ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. వచ్చేనెలలో 11, 12, 13 తేదీల్లో రెవెన్యూ స్పోర్ట్స్ నిర్వహించేందుకు కృషిచేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ కె కార్తీక్ మాట్లాడుతూ మనిషి పుట్టినప్పటి నుంచి మరణించే వరకు కూడా మానవ జీవితంలో సేవలందించే శాఖ రెవెన్యూశాఖ అని, ఈ శాఖలో పనిచేయడం గర్వంగా వుందన్నారు. పలు రకాల సర్టిఫికెట్లను జారీ చేయడంలో రెవెన్యూశాఖ కీలకపాత్ర పోషిస్తుందని, అన్ని ఉత్తర్వులు ఈ ఆఫీసు ద్వారా నిర్వహిస్తున్నామని, ఈ వ్యవస్థను మండలస్థాయి వరకు తీసుకెళ్లేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో రెవెన్యూ ఉద్యోగుల పాత్ర చాలా కీలకమని, ప్రజలతో మమేకమవుతూ నాణ్యమైన సేవలను పారదర్శకంగా అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం రెవెన్యూ అంశాలపై పూర్తి సమాచారంతో తయారుచేసిన రెవెన్యూ అకాడమీ వెబ్‌సైట్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. రెవెన్యూశాఖలో విశిష్ట సేవలందించిన పలువురు ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. రెవెన్యూ డే సందర్భంగా నాలుగు దశాబ్దాలుగా కలెక్టరేట్ పాత్రికేయుడిగా పనిచేస్తున్న వేలమూరు శ్రీధర్‌ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఘనంగా సత్కరించారు. జిల్లా రెవెన్యూ అధికారి ఉదయ భాస్కర్‌రావు, కలెక్టరేట్ ఏవో విజయకుమార్, జిల్లా రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అల్లంపాటి పెంచలరెడ్డి, అసోసియేట్ ప్రెసిడెంట్ మురళి, సెక్రటరీ డానియేల్ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు నాయుడుతోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం

### - నియోజకవర్గం టిడిపి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**ముత్తుకూరు, జూన్ 20, ప్రభాతవార్త** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని నియోజకవర్గం టిడిపి సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం ముత్తుకూరులో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో నిరుద్యోగ సమస్య నిర్మూలనకు సీఎం చంద్రబాబు నాయుడు నడుం బించారని తెలిపారు. అందులో భాగంగా సుమారు 20 లక్షలు మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా ప్రతీ నియోజ కవర్గంలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో 27వ తేదీ విక్రమార సింహపురి యూనివర్సిటీ ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశంను నియోజకవర్గంలోని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాగా మండలంలో టిడిపి నూతన కమిటీలు ఏర్పాటు చేస్తూ ఉన్నా మని, ఇప్పటికే టిడిపి మండలం అధ్యక్షులుగా నీలం మల్లిఖార్జున యాదవ్, ప్రధాన కార్యదర్శిలను నియమించడం జరిగిందన్నారు. అలాగే ఎస్సీ ఎస్టీ, మైనార్టీ, యువత, మహిళా విభాగం కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. నూతన కమిటీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శిలతోపాటు మండలంలో గ్రామ, గ్రామంలో పర్యటిస్తూ ఏడాది కూటమి పాలనలో సీఎం అమలు చేసిన సంక్షేమపథకాలు అందుతున్నాయా..?లేదా.? అని ఆరాతీ సున్నామన్నారు. ఎన్నికల హామీలను సీ ఎం చంద్రబాబు నాయుడు ఒక్కొక్కటి అమలు చేస్తూ ప్రజా మన్ననలు పొందుతూ వున్నారు. ప్రజలు కూడా సంతృప్తి వ్యక్తం చేస్తూ హర్షం వ్యక్తం చేస్తూ వున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఈదూరు రామ్మోహన్ రెడ్డి, అక్కయ్యగారి ఏడుకొండలు, మాజీ ఎంపిపి నన్నం ధీనయ్య, బొలిగర్ల శ్రీనివాసులు, దండు శ్రీనివాసులు, సుబ్బారావు, ఆలిముత్తు తదితరులు పాల్గొన్నారు.

## నూతన రోడ్ నిర్మాణ పనులు పరిశీలన



**నెల్లూరు కార్పొరేషన్, జూన్ 20 ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ ప్రధాన మార్గంగా ఉన్న పొదలకూరు రోడ్డులో నూతనంగా వేసిన తారు రోడ్డు నిర్మాణాన్ని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి కమిషనర్ వై.ఓ నందన్ శుక్రవారం పరి శీలించారు. నిర్దేశించిన ప్రమాణాలకు, కొల తలకు అనుగుణంగా నిర్మాణ పనులు జరి గాయా అని కమిషనర్ ప్రత్యక్షంగా విచారించారు.